# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన


- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 281 సోమవారం 13 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# నేడే నాలుగో దశ పోలింగ్



- కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని మొత్తం 175 స్థానాలకు ఎన్నికలు
- దేశవ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు
- ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానాలకు పోలింగ్

## ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామని

లోక్‌సభ ఎన్నికలకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు



హైదరాబాద్

తెలంగాణలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కు ను వినిగించుకోవాలి డీజీపీ రవి గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి -మిగతా3లో



## కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీట్లు వారి యువరాజు వయస్సును మించవు

- తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది
- సందేశ్‌ఖాలీలో టీఎంసీ నేతల చేతిలో అత్యాచారాలకు గురైన బాధిత మహిళలను టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారు
- టీఎంసీ పాలనలో బెంగాల్‌లో హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోయారు
- ప్రధాని నరేంద్రమోదీ

# తడిచిన ధాన్యం కొనుగోలుకు చేయాలి



- ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలి
- తెలంగాణలో వాన బీభత్సం...
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- నేడు కూడా తెలంగాణలో వర్షాలు
- పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు
- మెదక్ జిల్లాలో పిడుగుపాటుకు తాతామనవడు మృతి
- కొన్ని చోట్ల తడిసిపోయిన ధాన్యం
- తెలంగాణకు మరో ఐదు రోజుల పాటు వర్ష సూచన

హైదరాబాద్

తెలంగాణలోని పలు జిల్లాల్లో నేడు వర్ష బీభత్సం నెలకొంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో గాలివానతో తీవ్ర నష్టం చోటుచేసుకుంది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, భారీ వర్షం అతలాకుతలం చేశాయి. గాలులకు టార్పాలిన్ పట్టలు లేచిపోగా, భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయింది. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాల పరిధిలో గాలి వాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు -మిగతా3లో



## 2025 నాటికి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ అంచనా
- భారత్ ప్రస్తుత జీడీపీ 3.7 లక్షల కోట్ల డాలర్లకు చేరింది
- రికార్డ్ జీఎస్టీ వసూళ్లు, గత మూడు క్వార్టర్లలో 8 శాతం వృద్ధి రేటు
- పలు దేశాలతో భారత రూపాయల్లో వాణిజ్యం, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం వంటి అంశాలు భారత్ జీడీపీ పెరుగుదల కొనసాగేందుకు దోహదపడతాయి

# బరిలో కీలక నేతలు


నాలుగో విడతలో 94 స్థానాలకు పోలింగ్..

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్నిరకాలా భద్రతా ఏర్పాట్లు పూర్తి

ఏపీ, తెలంగాణ సహా మొత్తం 10 రాష్ట్రాల్లో పోలింగ్

హైదరాబాద్

సార్వత్రిక ఎన్నికల నాలుగో విడత పోలింగ్?కు సర్వం సిద్ధం అయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్నిరకాలా భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు ఎన్నికల అధికారులు. నాలుగో విడతలో ఏపీ, తెలంగాణ సహా మొత్తం 10 రాష్ట్రాల్లో రేపు పోలింగ్ జరగనుంది. నాలుగో విడతలో 96 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. ఏపీ(25), తెలంగాణ (17), బిహార్(5), ఝార?ండ్(4), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), ఒడిశా(4), యూపీ(13), ప.బెంగాల్(8), జమ్ముకశ్మీర్(1) స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. లోక్ సభతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఇదే విడతలో పోలింగ్ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక దేశ వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో కీలక నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ విడతలో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పోటీ చేస్తున్న కన్నౌజ్ నియోజకవర్గంలో పోలింగ్ జరుగుతోంది. బీజేపీకి కంచుకోటగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో కన్నౌజ్‌తో పాటు షాజహాన్‌పూర్, ఖేరీ, ధౌరహర, సీతాపూర్, -మిగతా3లో





# నిర్మానుష్యంగా భాగ్యనగరం

ఓట్ల పండుగకు ఊరెల్లిన జనం

ఓట్ల జాతరతో పాటు వరుస సెలవులు

కావడంతో నగరవాసులు స్వస్థలాలకు క్యూ

*స్టాండ్ బిజీబిజీగా మారింది.. రైల్వే స్టేషన్ ఇరుకైపోయింది. హైవేలు మరీ చిన్నగా తయారయ్యాయి. ఓట్ల పండుగ.. సంక్రాంతి పండుగ రికార్డును బ్రేక్ చేసేసింది. ఓటు వేసేందుకు భాగ్యనగరం బయల్దేరి వెళ్లింది. ఓట్ల జాతరతో పాటు వరుస సెలవులు కావడంతో నగరవాసులు స్వస్థలాలకు క్యూకట్టారు. దీంతో భాగ్యనగరం బోసి పోయింది. ఎన్నికల పుణ్యమాని హైదరాబాద్ సిటీ అంతా ఒక్కసారిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయింది.*

# ఇండియా కూటమి వస్తే.. గ్యారంటీలను పక్కాగా..

10 గ్యారంటీలు ప్రకటించిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. 10 గ్యారంటీలు అమలు చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఆదివారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ల ఉచిత కరెంట్ దేశవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. అలాగే పొరుగు దాయాది దేశం చైనా అక్రమించిన భారత సరిహద్దు ప్రాంతానికి విముక్తి కలిగిస్తామని తెలిపారు. అయితే ఈ 10 గ్యారంటీలపై ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలతో తాను చర్చించలేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే.. ఈ గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఇక తాను జైలు నుంచి విడుదల కావడం ఆలస్యమైందని.. దీంతో పలు దశల పోలింగ్ జరిగి పోయిందని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్.. మనీ ల్యాండరింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 21వ తేదీన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. దీంతో నాటి నుంచి ఆయన తీహాడ్ జైల్లోనే ఉన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనకు బెయిల్ ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించారు.

దీంతో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 1వ తేదీతో సార్వత్రిక ఎన్నికల చివరి దశ పోలింగ్ ముగియనుంది. ఈ నేపథ్యంలో జూన్ 2వ తేదీన లొంగిపోవాలని.. సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

కేజ్రీవాల్ ప్రకటించిన 10 గ్యారంటీలు...

1) దేశవ్యాప్తంగా విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ అందిస్తాం. అలాగే 200 యూనిట్ల వరకు ఎలక్ట్రసిటీ బిల్లు ఉచితంగా ఇస్తాం.

2) ప్రైవేట్ పాఠశాలల్లో కంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా మరింత మెరుగైన విద్యను అందిస్తాం.

3) ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలతోపాటు సౌకర్యాలను సైతం కల్పిస్తాం.

4) చైనా ఆధీనంలో ఉన్న భారత భూభాగాన్ని విముక్తి చేస్తాం.. అందుకోసం ఆర్మీకి పూర్తి స్వేచ్ఛనిస్తాం.

5) మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన అగ్ని వీర్ పథకాన్ని రద్దు చేస్తాం.

6)

రైతుల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తాం


7) ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదా తీసుకు వస్తాం.

8) ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం.

9) దేశంలోని అవినీతిని పారద్రోలతాం. భారతదేశాన్ని అవినీతిరహిత దేశంగా మారుస్తాం.

10) జీఎస్టీని సరళీకరిస్తాం

# నేడే నాలుగో దశ పోలింగ్




**హైదరాబాద్ :** నాలుగో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రేపు జరగనున్న ఈ దశలో మొత్తం 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆంధ్రప్రదేశ్ (25), తెలంగాణ (17), బిహార్ (5), జార్ఖండ్ (4), మధ్యప్రదేశ్ (8), మహారాష్ట్ర (11), ఒడిశా (4), యూపీ (13), పశ్చిమ బెంగాల్ (8), జమ్మూ కశ్మీర్‌లో శ్రీనగర్ ఒక సీటుకు పోలింగ్ జరగనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని మొత్తం 175 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ఒడిశా అసెంబ్లీకి సైతం 4 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మే 13వ తేదీన ఆ రాష్ట్ర అసెంబ్లీకి తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 1వ తేదీన జరిగే నాలుగో దశ పోలింగ్‌తో.. ఒడిశా అసెంబ్లీకి పోలింగ్ ముగియనుంది. ఇక లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి మాధవిలత, అసదుద్దీన్ ఓవైసీ, కరీంనగర్ నుంచి బండి సంజయ్, బిహార్‌లోని బిగుసరాయి నుంచి గిరిరాజ్ సింగ్, కడప నుంచి వైయస్ షర్మిల, జార?ండ్‌లోని ఖుంతి నుంచి అర్జున్ ముండా, బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శత్రుఘ్నసిన్హా, బెహరంపూర్ నుంచి యూసఫ్ పఠాన్, అధిర్ రంజన్ చౌదరి, రాజంపేట నుంచి ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో నిలిచారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్నాయి. ఆ క్రమంలో ఇప్పటి వరకు మూడు దశలో.. మొత్తం 285 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. రేపు నాలుగో దశ పోలింగ్ జరుగుతుంది. ఇంకా మూడు దశలు మే 20, మే 25, జూన్ 1వ తేదీన జరగనున్నాయి. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుందీ. అదే రోజు.. దేశంలోని ఓటరు ఏ పార్టీకి అధికారం కట్టబెడతాడనే విషయం స్పష్టం కానుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం అదే రోజు లెక్కించనున్నారు. దీంతో ఆ యా రాష్ట్రాల్లోని ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది సుస్పష్టం కానుంది.

## దేశ సంపదను బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతున్న మోదీ : ప్రియాంక గాంధీ



ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. యూపీలోని రాయ్‌బరేలిలో ఆదివారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. దేశ సంపదను మోదీ కేవలం నలుగురైదుగురు వ్యక్తులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ అనూహ్యంగా చేపట్టిన నోట్ల రద్దుతో కోట్లాది చిరు వ్యాపారులు, మహిళలకు కష్టాలు తెచ్చిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ హయాంలో ఈ పదేండ్లలో పేదల స్థితిగతులు ఏమాత్రం మెరుగుపడలేదని, కానీ కాషాయ పాలకులు చేసిన అరకొర పనులను వార్తా ఛానెల్స్‌లో అదేపనిగా చూపుతున్నారని ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. పేదలు, రైతుల కడుపుకొట్టి పారిశ్రామిక దిగ్గజాలకు మోదీ దోచిపెడుతున్నారని విమర్శించారు.

## ప్రధాని మోదీకి సీఎం కౌంటర్.. ఆ హామీల సంగతేంటి?



ఒడిశాలోని జిల్లాల పేర్లు చెప్పాలంటూ ప్రధాని మోదీ చేసిన సవాల్‌పై బిజు జనతాదళ్ (బీజేడీ) చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్ (%చీుఖజవవఅ ూఞుఖఅఎ%) తీవ్రంగా స్పందించారు. అసలు మీకు ఒడిశా గుర్తుందా? అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఒడియా శాస్త్రీయ బాష అయినప్పటికీ దాన్ని మోదీ మరిచారని, ఒడిస్సీ క్లాసికల్ సంగీతంపై తాను చేసిన ప్రతిపాదనలను కూడా రెండుసార్లు తిరస్కరించారని దుయ్యబట్టారు. తాను విడుదల చేసిన 3 నిమిషాల వీడియోలో ఆయన మోదీపై ఇలా కౌంటర్ ఎటాక్ చేశారు. "మోదీజీ.. నన్ను జిల్లాల పేర్లు అడుగుతున్న మీకు అసలు ఒడిశా గుర్తుందా? ఒడియా శాస్త్రీయ భాష అయినా, దాని గురించి మీరు పూర్తిగా మర్చిపోయారు. సంస్కృతానికి రూ.1000 కోట్లు కేటాయించారు కానీ, ఒడియాకు మాత్రం ఒక్క రూపాయి ఇవ్వలేదు" అని నవీన్ పట్నాయక్ ఆ వీడియోలో పేర్కొన్నారు. తాను క్లాసికల్ ఒడిస్సీ సంగీత గుర్తింపు విషయమై రెండుసార్లు ప్రతిపాదనలను గతంలో పంపించానని.. కానీ వాటిని తిరస్కరించారని ఆయన మండిపడ్డారు. ఒడిశాకు ఒడియా భాష, సంస్కృతిని అర్థం చేసుకునే ముఖ్యమంత్రి కావాలంటూ ఉద్ఘాటించారు. ఇదే సమయంలో.. ఒడిశాలో సహజ వనరులు ఎన్నో ఉన్నా ఆ రాష్ట్ర ప్రజలు పేదలుగా ఎందుకున్నారని ప్రధాని మోదీ సంధించిన ప్రశ్నకు కూడా నవీన్ పట్నాయక్ బదులిచ్చారు. ఒడిశా సహజ సంపద బొగ్గు అని, కేంద్రం ఆ బొగ్గుని తీసుకుంటుందని, కానీ గత పేదేళ్లలో బొగ్గుపై రాయల్టీని పెంచడం మర్చిపోయారని తూర్పారపట్టారు. కేవలం ఎన్నికల సమయంలో ఒడిశాను గుర్తు చేసుకుంటే ప్రయోజనం ఉండదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల చాలామందికి భారతరత్న ఇచ్చిన కేంద్రం.. ఒడిశా వీర కుమారులను ఎందుకు మరిచిపోయిందని నిలదీశారు. అలాగే.. ఒడిశా రాష్ట్రానికి 2014, 2019లో ప్రధాని మోదీ చేసిన వాగ్దానాలను కూడా నవీన్ పట్నాయక్ గుర్తు చేశారు. నిత్యావసర ధరలు తగ్గిస్తామని.. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని.. ఎల్‌పీజీ, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని.. అందరికీ మొబైల్ కనెక్టివిటీ కల్పిస్తామని.. మోదీ వాగ్దానాలు ఇచ్చారని.. కానీ అవేవీ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. జూన్ 10వ తేదీనే కాదు.. మరో పదేళ్లలోనూ ఏమీ జరగదని.. ఒడిశా ప్రజల హృదయాలను బీజేపీ గెలచుకోలేదని నవీన్ పట్నాయక్ చెప్పుకొచ్చారు.

## భారీగా నోట్ల కట్టలు..మంత్రికి ఈడీ సమన్లు



**రాంచీ:** జార్ఖాండ్ మంత్రి అలంగీర్ ఆలమ్ చిక్కుల్లో పడ్డారు. ఆయన పర్సనల్ సెక్రటరీ సంజీవ్ లాల్ సహాయకుడి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు పట్టుబడటంతో మంత్రి అలంగీర్‌కు ఈడీ నోటీసులు పంపింది. ఈనెల 14న తమ ముందు హాజరుకావాలని ఈడీ ఆయనను కోరింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై మనీలాండరింగ్ చట్టం కింద మే 6వ తేదీన రాంచీలో ఈడీ దాడులు నిర్వహించింది. సంజీవ్ లాల్ డొమిస్టిక్ హెల్ప్ జహంగీర్ ఇంట్లో లెక్కల్లో చూపించని రూ.35 కోట్ల నగదును స్వాధీనం చేసుకుంది. అనంతరం ఈ ఇద్దరినీ పీఎంఎల్‌ఏ కింద అరెస్టు చేయడంతో కోర్టు వారిని ఆరు రోజుల కస్టడీకి పంపింది. కాగా, కాంగ్రెస్ కోటా నుంచి జారా?ండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అలంగీర్ ఆలమ్ ఈ కేసులో తనకు ఎలాంటి ప్రమేయం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విచారణకు హాజరుకావాలంటూ మంత్రి అలంగీర్‌కు ఈడీ నోటీసులు పంపడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## 2025 నాటికి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



స్థూల ఆర్థిక వాతావరణం అనుకూలంగా ఉండటంతో భారత్ 2025 నాటికి జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ అంచనా వేశారు. 2022లో బ్రిటన్‌ను అధిగమించిన భారత్ ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ తర్వాత ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. భారత్ ప్రస్తుత జీడీపీ 3.7 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. రికార్డ్ జీఎస్టీ వసూళు ,, గత మూడు క్వార్టర్లలో 8 శాతం వృద్ధి రేటు, పలు దేశాలతో భారత రూపాయల్లో వాణిజ్యం, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం వంటి అంశాలు భారత్ జీడీపీ పెరుగుదల కొనసాగేందుకు దోహదపడతాయని అమితాబ్ కాంత్‌తో పాటు పలువురు ఆర్థిక నిపుణుల అంచనా వేస్తున్నారు. స్టీల్, సిమెంట్, ఆటోమొబైల్ తయారీ రంగాల్లో రెండంకెల వృద్ధి, ఈ-లావాదేవీలు 134 బిలియన్లకు ఎగబాకడంతో పాటు డిజిటల్ పబ్లిక్ మౌలికవసతుల్లో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగడం, గ్లోబల్ డిజిటల్ చెల్లింపుల్లో 46 శాతానికి పైగా వాటా భారత్ కలిగిఉండటం వంటి సానుకూల అంశాలతో భారత జీడీపీ వృద్ధి రేటు నిలకడగా కొనసాగే అవకాశం ఉందని అమితాబ్ కాంత్ అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో రాజకీయ స్థిరత్వం, మెరుగైన కేంద్ర బ్యాంక్ ద్రవ్య విధానం వంటివి భారత ఆర్థిక వ్యవస్థ ఇటీవల పలు క్వార్టర్స్‌లో మెరుగైన సామర్థ్యం కనబరిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్‌లో భారత జీడీపీ వృద్ధి రేటు అనూహ్యంగా 8.4 శాతంగా నమోదైంది.

## కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీట్లు వారి యువరాజు వయస్సును మించవు



ప్రధాని నరేంద్రమోదీ పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీపైన తీవ్ర విమర్శలు గుప్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేస్తూ సెటైర్‌లు వేశారు. ఆదివారం బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లా బరాక్‌పూర్‌లో బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. సందేశ్‌ఖాలీలో టీఎంసీ నేతల చేతిలో అత్యాచారాలకు గురైన బాధిత మహిళలను టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. టీఎంసీ బాధితులను వేధిస్తూ షాజహాన్ షేక్ లాంటి నేరస్థులకు రక్షణ కల్పిస్తోందని విమర్శించారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాలకు లొంగిపోవడంతో బెంగాల్‌లో హిందువులు రాముడి పేరు పలుకడానికి, శ్రీరామనవమి జరుపుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని అన్నారు. టీఎంసీ పాలనలో బెంగాల్‌లో హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోయారని వ్యాఖ్యానించారు. అదేవిధంగా నరేంద్రమోదీ ఉన్నంత వరకు 'సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను రద్దు చేయడం ఎవరివల్లా కాదని ప్రధాని మోదీ అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీపైనా మోదీ సెటైర్‌లు వేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేరును ప్రస్తావించకుండానే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ యువరాజు వయస్సుకు మించికి ఓట్లు రావని ఎద్దేవా చేశారు. అంటే ప్రస్తుతం రాహుల్‌గాంధీ వయస్సు 53 సంవత్సరాలు కాబట్టి కాంగ్రెస్‌కు 53 కంటే ఎక్కువ సీట్లు రావని అన్నారు.

# విపక్షఇండియా కూటమి గెలిస్తే ఏడాదికో ప్రధాని : అమిత్ షా

కాంగ్రెస్ సహా విపక్షాలు తమ ఓటు బ్యాంకు గురించి కలత చెందుతున్నాయని, బీజేపీ ఏ ఒక్కరికీ భయపడదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి గెలిస్తే వారి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరని ప్రశ్నించారు. వంతుల వారీగా తమ నేతలు ఏడాదికి ఒకరు చొప్పున ప్రధానమంత్రి బాధ్యతలు చేపడతారని విపక్ష నేత ఒకరు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. యూపీలోని ప్రతాప్‌ఘఢ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో పాటు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ధ్వంసం చేసిన కాశీ విశ్వనాథ్ కారిడార్‌ను సైతం మోదీ నిర్మించారని గుర్తుచేశారు. విపక్ష కూటమి అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి ఎవరవుతారో చెప్పలేని దుస్థితిలో కూటమి నేతలున్నారని వ్యాఖ్యానించారు. మోదీ మరోసారి ప్రధానిగా పాలనా పగ్గాలు చేపడితే రిజర్వేషన్లు రద్దవుతాయని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం సాగిస్తోందని దుయ్యబట్టారు.



# తడిచిన ధాన్యం కొనుగోలుకు చేయాలి

-మొదటి పేజి తరువాయి

చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు.

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలి రామోజీపల్లి శివారులో వరిధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో పిడుగు పడింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించారు. శ్రీరాములు, శివరాజు తాతామనవడు అని తెలుస్తోంది. అటు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మలోనూ పిడుగు పడింది. ఐదుగురికి గాయాలు కాగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను రిమ్స్ కు తరలించారు.

ఆసిఫాబాద్ లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది ఇబ్బందిపడ్డారు.

కాగా, తెలంగాణలో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మహబూబ్ నగర్, హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వివరించింది.

**వర్షాలకు ధాన్యం తడిసిపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**



తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుండడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతే రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందడంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. తెలంగాణకు మరో ఐదు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# పోలింగ్‌కు కౌంట్‌డౌన్ షురూ..!
# 17 ఎంపీ, కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉపఎన్నిక

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. 17 ఎంపీ సీట్లతో పాటు ఒక అసెంబ్లీ స్థానానికి మరికొద్ది గంటల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంల తరలింపు పూర్తయింది. పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. రేపు ఉదయం 5 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభం అవుతుంది. దాన్ని ఆరున్నరకల్లా ముగించి%ొా%ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ చేపడతారు

**ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్**

తెలంగాణలో పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొద్ది గంటల్లో 17 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నిక జరగనుంది. దీనికోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6గంటల వరకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసే ఛాన్స్ ఉంటుంది. ఇక, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తయింది. సెక్టార్ల వారీగా ఈవీఎంలను పంపిణీ చేశారు. భద్రత మధ్య పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలను తరలించారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు.

**సికింద్రాబాద్‌లో అత్యధికం.. ఆదిలాబాద్‌లో అత్యల్పం**

లోక్‌సభ ఎన్నికల బరిలో 525 మంది అభ్యర్థులు నిలిచారు. వీరిలో 50 మంది మహిళలు ఉన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో 45మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక మెదక్ ఎంపీ సీటులో 44మంది అభ్యర్థులు కుస్తీ పడుతున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ బరిలో అత్యల్పంగా 12మంది మాత్రమే బరిలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3కోట్ల 32లక్షల 32వేల మంది ఓటర్లు ఉంటే, వారిలో యువ ఓటర్లు 9 లక్షల 20 వేల మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35వేల 808 పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిలో సమస్యాత్మక కేంద్రాలు 9,900 ఉన్నాయి.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**



పోలింగ్ బందోబస్తు కోసం తెలంగాణలో 164 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించారు. మొత్తం 73,414 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు. 106అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మావోయిస్టు ప్రభావిత 13 అసెంబ్లీ స్థానాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియనుంది. ఇక 61 పోలింగ్ కేంద్రాల్లో 10మంది లోపే ఓటర్లు ఉండడం విశేషం.

**ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకోవాలి: సీఈవో**

తెలంగాణలో పోలింగ్‌కు సర్వం సిద్ధమైందన్నారు సీఈవో వికాస్‌రాజ్. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్‌తో కలిసి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో %ణ=జ% సెంటర్‌ను పరిశీలించారు వికాస్ రాజ్.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని.. ఓటింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. ఓటు ఎలా వేయాలో డెమో ద్వారా వివరించారు.

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్**

ఇక ఎంపీ స్థానాలకు పోలింగ్ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌లో హై అలర్ట్ ప్రకటించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్, మహబూబాబాద్ పరిధిలో బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉన్నామని తెలంగాణ డీజీపీ రవి గుప్తా తెలిపారు.

# నిర్మానుష్యంగా భాగ్యనగరం..

**ఓట్ల పండుగకు ఊరెళ్లిన జనం**
**ఓట్ల జాతరతో పాటు వరుస సెలవులు కావడంతో**
**నగరవాసులు స్వస్థలాలకు క్యూ**

స్టాండ్ బిజీబిజీగా మారింది.. రైల్వే స్టేషన్ ఇరుకైపోయింది. హైవేలు మరీ చిన్నగా తయారయ్యాయి. ఓట్ల పండుగ.. సంక్రాంతి పండుగ రికార్డును బ్రేక్ చేసేసింది. ఓటు వేసేందుకు భాగ్యనగరం బయల్దేరి వెళ్లింది. ఓట్ల జాతరతో పాటు వరుస సెలవులు కావడంతో నగరవాసులు స్వస్థలాలకు క్యూకట్టారు. దీంతో భాగ్యనగరం బోసి పోయింది. ఎన్నికల పుణ్యమాని హైదరాబాద్ సిటీ అంతా ఒక్కసారిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నో ట్రాఫిక్.. నో సిగ్నల్స్.. నో పొల్యూషన్‌తో భాగ్యనగరం, నయా నగరంగా కనిపిస్తోంది. కేవలం సంక్రాంతి పండుగ టైమ్‌లోనే సిటీలో కనిపించే ఇలాంటి దృశ్యాలు.. ఇప్పుడు ఓట్ల పండుగకు కనిపిస్తున్నాయి. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల కోసం నగరవాసులు పల్లెబాట పట్టారు. తమకు నచ్చిన నాయకుడిని గెలిపించేందుకు సొంతూళ్లకు పయనమయ్యారు. వేళ ప్రయాణికుల తాకిడితో టీఎస్ ఆర్టీసీ సంక్రాంతి పండుగ రికార్డ్‌ను బ్రేక్ చేసింది. సంక్రాంతి కన్నా 10 శాతం పైగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను వినియోగించుకున్నట్లు టీఎస్ ఆర్టీసీ వెల్లడించింది. ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో 1.42 లక్షల మంది ప్రయాణించగా.. ఇందులో ఏపీకి



59,800 మంది జర్నీ చేసినట్లు పేర్కొన్నారు. రేపే పోలింగ్ కావడంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగి అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్లలో ఉండే సెటిలర్లు పెద్ద ఎత్తున ఏపీకి వెళ్లినట్లు టీఎస్ ఆర్టీసీ వెల్లడించింది.

## ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

-మొదటి పేజి తరువాయి

చేశామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ విభాగాలు సహా.. 164 సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరాలను వెల్లడించారు. అలాగే 7వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో బందోబస్తు నిర్వహిస్తున్నా మని, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.186కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, తనిఖీలకు సంబంధించి 8,863 కేసులు నమోదు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కేంద్ర బలాలతో భద్రత ఏర్పాటు చేసాం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర సరిహద్దుల్లో పారామెలిటీ బలగాలతో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు.

## రేపు దేశవ్యాప్తంగా నాలుగో దశ ఎన్నికలు...
## ఏపీ, తెలంగాణల్లో పోలింగ్ కు సర్వం సిద్ధం

**9 రాష్ట్రాలు, 1 కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలో ఎన్నికలు**
**మొత్తం 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు**
**ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు**

దేశంలో రేపు (మే 13) నాలుగో విడత సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. 9 రాష్ట్రాలు, 1 కేంద్రపాలిత ప్రాంతం పరిధిలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నాలుగో విడతలో ఏపీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార?ండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, కశ్మీర్ లో ఎన్నికలు చేపడుతున్నారు. అదే సమయంలో ఏపీ, ఒడిశా అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. నాలుగో విడత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 1,717 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 1.92 లక్షల పోలింగ్ కేంద్రాల్లో 17.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలకు, 25 ఎంపీ స్థానాలకు... తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు నాలుగో విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

తెలంగాణలో 3.32 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 35,809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియలో 2.80 లక్షల మంది సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. ఈసీ 364 మంది ఎన్నికల పరిశీలకులను నియమించింది. 73,414 మంది పోలీసులను మోహరించారు. 500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ బలగాలు, 164 కేంద్ర బలగాలు, 7 వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో తెలంగాణలో భద్రత కల్పిస్తున్నారు.

ఏపీలో ఎన్నికల విధుల్లో 1.06 లక్షల మంది పాలుపంచుకుంటున్నారు. 34 వేలకు పైగా పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడిక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 14 నియోజకవర్గాలను సమస్యాత్మకం/సున్నితమైనవిగా భావించి వెబ్ కాస్టింగ్ పరిధిలోకి తీసుకువచ్చారు. ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య 4.14 కోట్లు. రాష్ట్రవ్యాప్తంగా 46,389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అసెంబ్లీకి 2,387 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, లోక్ సభ బరిలో 454 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఏపీలో ఈసారి సీఎం జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి (లోక్ సభ), సుజనా చౌదరి, రఘురామకృష్ణరాజు, సీఎం రమేశ్ (లోక్ సభ), నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి (లోక్ సభ) వంటి ప్రముఖులు పోటీ చేస్తుండడం తెలిసిందే.

## ఓట్ల పండుగపై వర్షం ఎఫెక్ట్ పడనుందాొా%?
## వెదర్ రిపోర్ట్ ఏంటి..?



సోమవారం ఓట్ల పండుగపై వర్షం ఎఫెక్ట్ పడనుందా%ొా%? పోలింగ్ రోజున వర్షం షాకిస్తుందా%ొా%? ఇప్పటికే పలుచోట్ల వాన దంచికొడుతుండటం%ొా% వాతావరణశాఖ మరో మూడ్రోజులు భారీ వర్షాలంటూ వార్నింగ్ ఇవ్వడం%ొా% మరింత ఆందోళన కలిగిస్తోంది. తాజాగా కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని వర్షం వణికిస్తోంది. పోలింగ్‌కు ఏర్పాట్లు జరుగుతుండగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, ఈదురుగాలులతో కూడిన వాన రావడంతో టెంట్లు తడిచిపోయాయి. కుర్చీలు ఎగిరిపోయాయి. మరోవైపు పోలింగ్ సిబ్బంది తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం నుంచి %జుఎవీ%లను కాపాడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మెషీన్లు, కంట్రోలింగ్ యూనిట్లపై వర్షం నీరు పడుతుండటంతో.. వాటిని కాపాడేందుకు ఎన్నికల సిబ్బంది నానా తంటాలు పడుతోంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ వర్షం బీభత్సం సృష్టిస్తోంది. బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. పెద్ద ఎత్తున ఈదురుగాలులతో కూడిన వాన రావడంతో పోలింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాటు చేసిన టెంట్లన్నీ నేలమట్టమయ్యాయి. వర్షానికి పలు పోలింగ్ కేంద్రాల్లో భారీగా నీరు చేరడం%ొా% సోమవారం పోలింగ్ నిర్వహణపై ఆందోళన కలిగిస్తోంది. ఇటు ఏపీని వర్షాలు భయపెడుతున్నాయి. పలుచోట్ల ఈదురుగాలలతో కూడిన వర్షం పడుతోంది. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు చెల్లాచెదురుగా ఎగిరి పడుతున్నాయి. కడప జిల్లా పులివెందులలో వర్షం బీభత్సం సృష్టించింది. ఉన్నట్టుంది పులివెందులలో వాతావరణం మారిపోయింది. భారీ ఈదురుగాలులతో వర్షం విరుచుకుపడింది. దీంతో పులివెందుల పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికలకు ఏర్పాటు చేసిన టెంట్లు కూలిపోయాయి. కుర్చీలు ఎగిరిపడ్డారు. ఎన్నికల అధికారులు సైతం ఇబ్బందులు పడ్డారు. రేపటి ఎన్నికలకు ఆటంకం కలుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.ఖ

## బరిలో కీలక నేతలు..

-మొదటి పేజి తరువాయి

హర్దోయి, మిస్రిఖ్, ఉన్నావ్, ఫరూఖాబాద్, ఎటా, కాన్పూర్, అక్బర్‌పూర్, బహ్రైచ్ నియోజవర్గాల్లో రేపు ఎన్నికలు నిర్వహించనున్నారు. 4వ విడతలో పోటీలో ఉన్న ప్రముఖుల్లో అఖిలేష్?తో పాటు టీఎంసీ నేతలు మహువా మొయిత్ర వెస్ట్ బెంగాల్ కృష్ణనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్నారు. అలాగే తృణముల్ కాంగ్రెస్ నేత శత్రుఘ్న సిన్హా ఆసన్సోల్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ ముఖ్య నేతలు గిరిరాజ్ సింగ్ బీహార్?లోని బేగుసరాయి నియోజకవర్గంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఝార?ండ్ నుంచి ఖుంటి నియోజకవర్గంలో అర్జున్ ముండా పోటీ చేస్తున్నారు. మూడో విడతలో అధికారంలో ఉన్న అమిత్ షా వంటి అగ్రనేతలు బరిలో నిలిస్తే ఇప్పుడు ప్రతిపక్షంలోని ముఖ్యనేతలు ఎన్నికల్లో పోటీ చేయడంతో ఆసక్తిగా మారింది.

## సంపాదకీయం

# చార్ సౌ... సాధ్యమేనా

లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి గెలిచి సత్తా చాటాలని భారతీయ జనతా పార్టీ ఆరాటపడుతోంది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలిచేందుకు బీజేపీ ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను ప్రకటించింది. కొత్త పొత్తులు, విపక్ష నేతలను పార్టీలను చేర్చుకోవటంతో బాటు 2019లో ఓడిన స్థానాల మీద ప్రత్యేక దృష్టి పెట్టింది.2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బరిలో నిలిచే సీట్లు 450. మోదీ చెబుతున్నట్లు బీజేపీ 370 గెలవాలంటే పోటీచేసే మొత్తం సీట్లలో ఏకంగా 82 శాతం సీట్లు గెలవాల్సి ఉంది. ఇప్పటి వరకు బీజేపీ చరిత్రలో ఆ పార్టీ 2019లో 70 శాతం సీట్లలో గెలిచింది. ఆ ఎన్నికల్లో 436 సీట్లకు పోటీ చేసి 303 సీట్లను బీజేపీ గెలుచుకోగలిగింది. పై సమీకరణాల నేపథ్యంలో బీజేపీ, దాని మిత్ర పక్షాలు కనీసం గతంలో గెలుచుకున్న సీట్లలో 60 నుంచి 70 సీట్లు కోల్పోయే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలోనే బీజేపీ రెండు మెట్లు దిగి ఏపీ, ఒడిసా వంటి రాష్ట్రాల్లో పొత్తుకు సిద్ధపడింది. 2019 ఎన్నికల్లో గెలుచుకున్న303కు అదనంగా మరో 97 స్థానాలు గెలిచి, 1984లో ఇందిరాగాంధీ మరణం తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 49% ఓట్లు, 404 సీట్ల రికార్డును తిరగరాయాలని పనిచేస్తోంది. దీనికోసం 'అబ్ కీ బార్.. చార్ సౌ కీ పార్' అనే ఆకర్షణీయమైన నినాదాన్నీ ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశపు కీలక రాజకీయ పక్షంగా బీజేపీ ఆకాంక్ష మెచ్చుకోదగినదే అయినా క్షేత్రస్థాయి వాతావరణం మాత్రం అదంత సులభం కాదనే సందేశాలు పంపుతోంది.బీజేపీకి ఆయువుపట్టుగా ఉన్న రాష్ట్రాలో ఉత్తరప్రదేశ్ మొదటిది. ఇక్కడి 80 లోక్‌సభ సీట్లలో 2019లో ఆ పార్టీ 62 సీట్లు గెలిచింది. నాడు ఆ మిగిలిన స్థానాల్లో బీఎస్పీ 10, ఎస్పీ 5, ఇతరులు 3 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే, 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41.29 శాతం ఓట్లకే పరిమితమైంది. యూపీలో మోదీ, యోగీ చరిష్మా, అయోధ్య అంశాలు బీజేపీకి కలిసొచ్చే మాట నిజమే అయినా, ఈసారి అక్కడ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీపార్టీ పొత్తుకు సిద్ధమయ్యాయి. మొత్తం 80 సీట్లలో 62 స్థానాల్లో ఎస్పీ, 17 సీట్లలో కాంగ్రెస్, 1 స్థానంలో ఆప్ పార్టీలు పోటీ చేయనున్నాయి. ఇక్కడ మాయావతి ఒంటరిగా పోటీచేయటం వల్ల 2019లో బీజేపీ సాధించిన 62 సీట్లలో కనీసం 15 సీట్లలో కోత పడే ప్రమాదం ఉంది. ఇక బీహార్ విషయానికి వస్తే.. అక్కడున్న మొత్తం 40 సీట్లలో 2019లో బీజేపీ 17, దాని నాటి మిత్రపక్షం జేడీయూ 16, లోక్‌జనశక్తి పార్టీ 6 సీట్లు సాధించాయి. అయితే, ఆ తర్వాత నితీష్ కుమార్ లాలూయాదవ్ ఆర్జేడీతో చేతులు కలిపి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎంగా బాధ్యతలు చేపట్టి, తాజాగా తిరిగి ఎన్డీయేలో చేరారు. ఈ గోడదూకుడు వ్యవహారం నితీష్‌తో బాటు బీజేపీకి కూడా చెడ్డపేరు తీసుకొచ్చింది. దీనికి తోడు కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో పొత్తు పెట్టుకోవటంతో అక్కడ ఈసారి ఎన్డీయే సీట్లు సగానికి కోతపడనున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఆ పక్కనే ఉన్న జార్ఖండ్‌లో 14 సీట్లు ఉండగా, 2019లో బీజేపీకి 11, దాని మిత్రపక్షమైన ఏజేఎస్‌యు ఒక స్థానంలో గెలిచింది. 2024లో కాంగ్రెస్ 7, జేఎంఎం 5, వామపక్షాలు 2 స్థానాల్లో ఇక్కడ బరిలో దిగనున్నాయి. హేమంత్ సోరెన్ రాజీనామా తర్వాతి పరిణామాలు ఇక్కడ కాంగ్రెస్- జేఎంఎం కూటమి వల్ల బీజేపీ ఆరు సీట్లకి మించి గెలవటం కష్టమనే అభిప్రాయం ఉంది.మహారాష్ట్రలోని 48 సీట్లలో 2019లో బీజేపీ 23, శివసేన 18 స్థానాలు గెలవగా, కాంగ్రెస్, ఎంఐఎం చెరొకస్థానం, ఎన్సీపీ 4 సీట్లు గెలిచింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల తర్వాత శివసేన.. కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయటం, అది శివసేన చీలికతో ప్రభుత్వం పడిపోవటం జరిగింది. ఈసారి శివసేన (ఉద్ధవ్) 19, కాంగ్రెస్16, శరద్పవార్‌ఎన్సీపీ 9 స్థానాల్లో పొత్తుమీద పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ కూటమి అవకాశాలు గతంలో కంటే మెరుగుపడ్డాయని సమాచారం. ఇక ఒడిసాలో 21 సీట్లుండగా బీజేపీ-బీజేడీ పొత్తు కుదుర్చుకున్నాయి. ఇక్కడ బీజేపీ 8, బీజేడీ 13 సీట్లలో పోటీచేస్తున్నాయి కనుక ఇది బీజేపీకి విన్ విన్ డీల్ లాంటిది. ఇక పశ్చిమబెంగాల్‌లోని 42 సీట్లలో 2019లో బీజేపీ 18 సీట్లు గెలిచింది. ఈసారి మమత ఒంటరి పోరుకు సిద్ధం కావటంతో కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి బరిలో దిగనుంది. ఇక్కడ బీజేపీ బలం గతంలో కంటే తగ్గే అవకాశం ఉండటం ఇండియా కూటమికి కలిసొచ్చే అంశం కావచ్చు. ఇటీవలి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ అధికారంలోకి వచ్చిన మాట నిజమే అయినా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల శాతం తక్కువే. ఈ మూడు రాష్ట్రాల్లోని 65 సీట్లలో 2019లో బీజేపీ 61 స్థానాల్లో గెలిచింది. 2024 ఎన్నికల్లో బీజేపీ ఈ మూడు రాష్ట్రాల్లో 40 సీట్లకు మించి సాధించే అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయి.ఇక.. గుజరాత్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని 52 లోక్‌సభ సీట్లుండగా, 2019లో వీటిన్నింటిలోనూ బీజేపీయే గెలిచింది. కానీ, ప్రస్తుతం హిమాచల్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, ఢిల్లీ, గుజరాత్‌లో కాంగ్రెస్- ఆప్‌తో పొత్తు, హర్యానాలో వీస్తున్న కాంగ్రెస్ సానుకూల పవనాల వల్ల ఈ 5 రాష్ట్రాల్లో బీజేపీ గతంలో కంటే 12 సీట్లు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇక దక్షిణాదిన గల తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మొత్తం 128 సీట్లుండగా, 2019లో బీజేపీ కర్ణాటకలో 25, తెలంగాణలో 4 సీట్లు గెలిచింది. ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ హవా కారణంగా పది స్థానాలకు, తెలంగాణలో 4 సీట్లకే పరిమితం కానుందని సర్వేలు చెబుతున్నాయి. అయితే.. ఏపీలో జనసేన- టీడీపీ పొత్తులో 6 సీట్లు పొందినా అందులో గెలిచేది సగమే. ఈ క్రమంలో మొత్తంగా చూసినప్పుడు దక్షిణాదిలో బీజేపీ సొంతగా గెలిచే సీట్లు 18 లోపే ఉండవచ్చు. తమిళనాడు, కేరళలో అది సీట్లు పొందే పరిస్థితి లేదు.మరోవైపు పంజాబ్‌లోని 13, జమ్మూ కాశ్మీర్‌లోని 6, గోవాలోని 2 .. మొత్తం 21 సీట్లలో 2019లో బీజేపీ 6, కాంగ్రెస్ 9, అకాలీదళ్ 2, నేషనల్ కాన్ఫరెన్స్ 3, ఆప్ ఒక సీటు గెలుచుకున్నాయి. ఈసారి ఇక్కడ బీజేపీకి ఒకటో రెండో పోవటం తప్ప లాభం వచ్చే అవకాశం కనిపించటం లేదు. ఈశాన్య భారతంలోని అస్సాంలో 14, మిగిలిన ఆరు రాష్ట్రాల్లోని 11 స్థానాల్లో 2019లో వీటిలో 15 సీట్లు బీజేపీ గెలవగా, 5 సీట్లు దాని మిత్రపక్షాలు గెలిచాయి. ఇక్కడ ఇంతకంటే బీజేపీ పొందటానికి ఇంకేమీ కనిపించటం లేదు. చివరగా 6 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 6 సీట్లుండగా, 2019లో బీజేపీ, కాంగ్రెస్, ఇతరులు తలా రెండు సీట్లు గెలుచుకున్నాయి. కనుక ఇక్కడ కూడా బీజేపీ అదనంగా పొందటానికి ఏమీ లేదు.ఏది ఏమైనా మోదీ నినాదం ఏమేరకు నిజమవుతుందో చూడాలంటే దేశ ప్రజలు జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

# కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి నారసింహుడు

'భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుం శేషా చలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగువా రుండరంటే అతిశయోక్తి కాదేమో... భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి, ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం. కరీంనగర్ కు 71 కిలోమీటర్ల ఉత్తరాన, జగిత్యాలకు 27 కిలోమీ టర్ల ఈశాన్యాన తెలంగాణ లోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నదీ క్షేత్ర రాజం. ప్రధానంగా శివకేశవుల నిలయమై, శ్రీల క్ష్మీనరసింహ, రామలింగేశ్వర ఆలయాలు, మసీదు పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ ముస్లిం మత సామరస్యానికి ప్రతీకగా నిలచి ఉన్నదీ పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికె సింగన పద్మ పురాణంలో, చెరి కొండ ధర్మన్న చిత్ర భారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్రనాధుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనామాత్యుని నారాయణ శత కంలో, పింగళి సూరనార్యుని కళాపూర్ణో దయంలో, శేషాచలదాసు - నరహరి, నృసింహ, నృకేసరి శతకాలలో, కాకతీయానంతర శాసనాలలో, మధ్యయుగ దానపత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది. పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి చేసిన తపస్సు ఫలితంగా "ధర్మపురి" నామాంకిత, నృసిం హుడు భక్తుల కోర్కెలు తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని, పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి.

గౌతమ మహర్షి, తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టుకునేందుకు పరమశివుని గూర్చి తపస్సు చేసి, ఆయన జటాజూటం నందు గల "గంగా దేవి"ని ధర్మపురికి రప్పించినందున "గౌతమి, గోదావరి" అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశద పరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామాలయం, దత్తాత్రేయ, గౌతమేశ్వర, శ్రీసాయి శివ బాలాజీ , అయ్యప్ప, ప్రసన్నాంజనేయ, భక్తాంజనేయ, యమ ధర్మరాజ, సంతోషిమాత, సత్యవతీ, మహాలక్ష్మి మందిరాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. రామాయణ, భారత, భాగవతాది పురాణ ఘట్టాలు చెక్కబడిన నృసింహాల యపు కాకతీయుల శిల్పకళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివాలయంలోని గణేష, చండిక, సప్తమాతృకలు, నల్లశెనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగములందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై విదర్భ రాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది. తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియు నైజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దిన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్ సైన్యం క్రీస్తు శకం 1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నృసింహాలయం, రామేశ్వరా లయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది.



14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి, బ్రాహ్మణులకు గృహములను నిర్మింపజేసి, అన్నసత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురి వాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు. అద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్ర మున యాత్రికుల సౌకర్యార్థం నివాస స్థానములను కట్టించువారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణ మందిరములను ఉద్ధరించువారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అను భవించగలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచువారు నందనాది వనములతో సౌఖ్యములను అను భవించ గలరని, శ్రీనృసింహు శాల్యన్నమును, దధ్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రు లగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రాహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానములనొసంగువారు ముందు జన్మమున సార్వ భౌములగుదురని, క్షేత్రమున దీనాంధులకు, దంపతులకు, బ్రహ్మచారులకు, పశుపక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో, నృసింహ కటాక్షమున వారి వారి పితృదేవతలు మోక్షమును పొందగలరని, శౌనకాది మహర్షు లకు నైమిషారణ్యము నందు శూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహత్యం విశదపరుస్తున్నది.

రామకృష్ణాది అవతారములవలె గాక, నిర్యాణములేని శాశ్వత అవతారమైన శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యాత్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో, ఆకాల మృత్యు భయముండదని, దుష్టగ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గలదని భక్తుల, సాంప్రదాయా చరణాసక్తుల ప్రగాఢ విశ్వాసం. "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం, నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం" మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది. పగలు రాత్రి కాని సంధ్యా. సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూకాని చేతిగోళ్ళతో, హిరణ్యకశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అవతారాలకు భిన్నం.

కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర) నవరాత్రి ఉత్సవాలు మే 13వ తేదీ నుండి 21వ తేదీ వరకు సాంప్ర దాయ రీతిలో జరుగనున్నాయి. సర్వ దేవతా మూర్తులను కలిగి 'ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు' అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర మరియు పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా వైశాఖ శుక్ల షష్ఠి నుండి చతుర్దశి వరకు స్థానిక దైవాల నవరాత్రి ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది. ఈ సంవత్సరం ప్రధానంగా మే 17 న సహస్ర కలశాభిషేకం, 18న చందనోత్సవం, 19న వసంతోత్సవం, పల్లవోత్సవం, అన్న కూటోత్సవం, నిత్య ఆరాధనలతో పాటు 20న లక్ష తులసీ పూజ, సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. 21న నర సింహ జయంతి, ప్రత్యేక స్థంభోద్భవ పూజాది కాలు నిర్వహించ నున్నారు. దేవస్థానం ఏసి, ఈఓ సంకటాల శ్రీనివాస్, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ముత్యాల శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది కార్యక్ర మాల ఏర్పాట్లు, నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.

# నైటింగేల్‌కు నిజమైన వారసులు

అవివాహితలు ఇంటి పనులు, చర్చి పనులే చేయాలనీ ఆంక్షలు విధించ బడిన రోజులవి. స్త్రీలు ఇంటి పట్టునే ఉండాలన్న కట్టుబాట్లను ఆమె ఛేదించింది. ఆ రోజుల్లోనే ఒక విధంగా సంఘం మీద తిరగ బడింది. పేదలకు, అనాథలకు సేవ చేయాలన్న అభిలాషతో, ఇంటా, బయటా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా, లక్ష్య సాధనలో మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శించింది. రోగుల పాలిటి దేవతగా వెలుగొందింది. ఆమే విశ్వ విఖ్యాత ఫ్లోరెన్స్ నైటింగేల్. నైటింగేల్ ఎంతో గొప్పింటి పిల్ల అయినా నర్సుగా సేవలు అందించడానికే నిశ్చయించుకుంది. ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820, మే 12న ఇటలీలో జన్మించింది. 1853న లండన్ లోని ఓ స్త్రీల ఆస్పత్రిలో సూపరిండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకొని వెళ్ళింది."ది లేడీ విత్ ది లాంప్" గా పిలువబడే ఫ్లోరెన్స్ నైటింగేల్, ఒక బ్రిటిష్ నర్సు, సామాజిక సంస్కర్తగా, గణాంక నిపుణురాలిగా, ఆధునిక నర్సింగ్ స్థాపకురాలుగా ప్రసిద్ధి గాంచింది. వైద్య రంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపు కుంటారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ దినోత్సవం నాడు గుర్తు చేసుకుంటారు. ఆ రోజుల్లో ఆస్పత్రులు అధ్వాన్న స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత, ఏమాత్రం ఉండేవికావు. అయినాకూడా ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగు పని చేయడానికే నిర్ణయించుకుంది. తన తల్లి సాహితి ప్రపంచంలో ధ్రువతారగా వెలగాలని కోరినా, ఫ్లోరెన్స్ నైటింగేల్, జర్మనీలో కైసర్ సంస్థను గూర్చి విని, అక్కడే పని చేయాలనీ నిర్ణయించుకుంది. ఇద్దరు బిడ్డల్ని దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టింది.1852 లో ఐర్లాండ్ వెళ్ళింది. అక్కడి ఆసుపత్రులను చూడగానే వాటిల్లో విప్లవాత్మకమైన మార్పులను తేవాలి అనుకున్నది. 1853 లో సిస్టర్స్ ఆఫ్ చారిటికి వెళ్ళింది. తిరిగి లండన్ వచ్చి, తన నాయనమ్మకు సేవ చేయడానికి రాగా అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి రోగులకు, పగలు, రాత్రి అనక సేవలందించింది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి రోగులకు మంచి ఆహారం అందించింది. 1854-56 లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లారెన్స్ వచ్చి తోటి నర్సులను కూడగట్టుకొని యుద్ధంలో గాయాలైన సైనికులకు నిరుపమాన సేవలందించింది. ధైర్యం చెప్పింది. సాటి నర్సులు విసుక్కునేవారు. ఏ పని దొరక్క ఈ పనికి వచ్చాం అనేవారు. కానీ ఎంతో ధనిక కుటుంబం లోనుంచి వచ్చిన ఆమె ఏరి కోరి పనిని ఎంతో శ్రద్ధతో, ఇష్టంతో చేసేది. గుండె నిబ్బరంతో, చిమ్మ చీకట్లో కూడా చిరు దీపం వెంట తీసుకుని వెళ్లి సేవలు చేసేది. అందుకే ఆమె లేడీ విత్ ది లాంప్ గా వాసికెక్కింది. మొదట్లో ఆమెను చూసి అధికారులు జ్వలించి పోయేవారు. తరువాత ఆమె నిరుపమాన సేవకు ముగ్ధులయ్యారు. వారికి రోజూ, రోగులకు కావాల్సిన మందులు పరికరాలను పంపమని అభ్యర్ధనలు పంపి, పలుమార్లు స్వంత డబ్బు ఖర్చు పెట్టి అన్ని తెప్పించేది. ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే, అధికారులను ఒప్పించి పాత ఇళ్ళను, భవంతులను ఆసుపత్రులుగా మార్చేది. రాత్రులలో రెండు, మూడు గంటలే పడుకుని అహర్నిశలు పని చేసేసరికి ఆమె చిక్కి పోయింది. అయినా రోగులకు ఆమె ఆరాధ్య దైవం. ఆమె నడచిన దారి అతి పవిత్రం. వారు విక్టోరియా రాణి మరణిస్తే ఫ్లారెన్స్ ను రాణి చేస్తామని" అనేవారట. ఆమె ఎక్కడికి వెళ్ళినా సైనికులు అడవి పూలతో పుష్ప గుచ్చాల నిచ్చేవారట. అది చూసి తోటి డాక్టర్లు, నర్సులు అసూయ చెందేవారట. అయినా ఆమె తన సేవలను మానకుండా చేస్తూండగా ఒకనాడు స్పృహ తప్పి పడిపోయింది. సైనికులకు వచ్చిన జ్వరమే ఆమెకు వచ్చింది. కాసిల్ ఆసుపత్రిలో ఆమెను రోగిగా చేర్చుకున్నారు. ఆమెను చూసి మిగతా రోగులు కన్నీరు కార్చారు. అయినా ఆరోగ్యం మెరుగు పడగానే, తిరిగి క్రిమియా, స్కుటారి ఆసుపత్రుల మధ్య తిరుగుతూ రోగులకు సేవలందించింది. గ్రంథాలయాలు, చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్‌ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్, అనే గ్రంథాలను వ్రాయడమే కాకుండా, విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్ధనలను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణను ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24 న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సేస్ అనే సంస్థను లండన్ లో స్థాపించారు. ఆమెను' మదర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్' గా గుర్తించారు.. భారత దేశానికి కూడా ఆమె ఇతోధిక సేవలనందించింది. 1859 లో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమిషన్ ను నియమించింది. చెన్నై నగరపు మేయర్ ఆడ నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు. 1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించింది. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టిన రోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించారు. నర్సులు దినోత్సవం రోజున, నర్సింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా విశేష సేవలందించిన నర్సులకు భారత రాష్ట్రపతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందిస్తారు. 1973లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఈ అవార్డులో భాగంగా కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత, స్వచ్ఛంద సంస్థల్లో విశిష్ట సేవలందించిన నర్సులకు ఒక పతకం, ప్రశంసాపతరం, జ్ఞాపికతో పాటు 50వేల రూపాయిల నగదు బహుమతిని బహుకరిస్తారు. రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యం. నర్సులు లేదని ఆసుపత్రి సేవలే లేవు.

# ఫుట్‌బాల్ ఆడిన రేవంత్ రెడ్డి.. ఇండియా టీషర్ట్ ఎలా ధరిస్తారని ప్రశ్నించిన క్రిశాంక్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. రాష్ట్రంలో మరికొద్ది గంటల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. కాబట్టి ఎన్నికలు అయ్యేదాకా రాజకీయ నాయకులు ఎలాంటి ప్రచారంలో పాల్గొనకూడదు. కానీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. అయితే, ఈ సమయంలో %×చీణ×ూా% అని పేరు రాసి ఉన్న టీషర్ట్ ధరించడంపై బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ క్రిశాంక్ ట్విట్టర్ (ఎక్స్ ) వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు.
ఇండియన్ ఫుట్‌బాల్ టీమ్‌కు రేవంత్ రెడ్డి కనీసం సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ కాదు.. అలాంటప్పుడు ఇండియా అనే పేరు ఉన్న టీషర్ట్ ఎందుకు ధరించారని మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. కాంగ్రెస్ కూటమి పేరు %×చీణ×ూా% కాబట్టే ఇలా ఇండియా అనే పేరున్న టీషర్ట్‌ను ధరించారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత కూడా ఇలా కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రచారం చేస్తూ అందర్నీ ఫూల్స్ చేస్తున్నారని మండిపడ్డారు.



## కోదాడలో పార్లమెంటు ఎన్నికలకు సర్వం సిద్ధం
**– డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**






**వాస్తవ నేస్తం,కోదాడ:** నల్లగొండ పార్లమెంట్ ఎన్నికకు సంబంధించి కోదాడ నియోజకవర్గంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని బాలాజీ నగర్ లో గల ప్రభుత్వ గోదాం వద్ద పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలను, ఎన్నికల సామాగ్రిని ఆర్డీవో సూర్యనారాయణ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. కోదాడ నియోజకవర్గంలో మొత్తం 2,45,187 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,19,172 మంది కాగా మహిళలు 1,25,997 మంది ట్రాన్స్ జెండాలు 18 మంది ఉన్నారు.నియోజవర్గంలో మొత్తం 296 పోలింగ్ బూత్ లు ఉండగా 1500 మంది పోలింగ్ సిబ్బంది 700 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారు. కాగా బాలాజీ నగర్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ వెంకట్రావు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## పిడుగుపడి రైతు మృతి.. ఐదుగురికి గాయాలు
**– క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్**




**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** పిడుగుపాటుకు ఒక రైతు మృతి చెందగా ఐదుగురికి గాయాలైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో జరిగింది. ఆదివారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మ గ్రామంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సంతో అకాల వర్షం కురిసింది. పంట చేనులో వ్యవసాయ పనులు చేస్తున్న అదే గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ (29) పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందగా, మరో అయిదురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ గాయపడ్డ భోజన్న నాగో రావు, టిల్లు లను పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## రోజా వర్సెస్ జబర్దస్ట్ టీమ్

**తిరుపతి :** సినిమాలు తగ్గిపోయాక.. టీవీ షోలను నమ్ముకుని చాలా కాలం గడిపారు మంత్రి రోజా.. తనకు గుర్తింపు తెచ్చిన సినీ ఇండస్ట్రీపై సీఎం జగన్ పెత్తనం చేయాలని చూసినా .. ఆమె ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. రాజకీయాల్లో ఐరన్ లెగ్ అని బ్రాండ్ వేయించుకున్న ఆమె ఎట్టకేలకు మినిస్టర్ అవ్వగలిగారు. మరోసారి నగరి బరిలో దిగిన రోజా ఎప్పటిలాగే తన వివాదాస్పద వ్యాఖ్యలతో ట్రోల్ అవుతున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారాల్లో సినీ నటులకు ధీటుగా ఫోకస్ అవుతున్నారు టీవీ స్టార్లు ముఖ్యంగా జబర్దస్త్ ఫేంలు తమ పంచ్ డైలాగ్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆ క్రమంలో పవన్ అభిమాని హైపర్ ఆదిని చిన్నచూపు చూస్తూ రోజా చేసిన వ్యాఖ్యలు పెద్ద కాంట్రవర్సీకే దారితీస్తున్నాయి.మినిస్టర్ రోజా టీడీపీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన మాజీ హీరోయిన్ రోజా .. టీడీపీలో ఆమె అడుగుపెట్టారో లేదో చంద్రబాబుపై అలిపిరి వద్ద బాంబు దాడి జరిగింది. ఆ తర్వాత 2004 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. అప్పటికి 9 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మాజీ అయ్యారు. తర్వాత కాంగ్రెస్ వరుసగా రెండో సారి అధికారంలోకి రావడంతో రోజా వైఎస్ పంచకు చేరారు. పాపం అదే సమయంలో హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన దివంగతులయ్యారు. ఆ ఎఫెక్ట్‌తో రోజాకు ఐరెన్ లెగ్ టాగ్ లైన్ వచ్చేసింది.తర్వాత జగన్ బాటపట్టి 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రోజా .. వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో జబర్దస్త్ షోలు చేసుకుంటూ గడిపేశారు .. సినిమాల కంటే జబర్దస్త్ షోలతోనే ఆమె పాపులర్ అయ్యారన్న టాక్ ఉంది ? వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి టీడీపీ, జనసేనలను టార్గెట్ చేయడమే పనిగా పెట్టుకున్నారామె.. మరీముఖ్యంగా జగన్ మెప్పుకోసం జనసేనానిపై ఒంటికాలితో లెగుస్తుంటారు? పీకే పవర్‌స్టార్ అసలు పార్టీ ఎందుకు పెట్టారో అర్థం కాదని .. చంద్రబాబు వేసిన కుక్క బిస్కెట్ల కోసం పవన్ తోక ఊపుకుంటూ వెళ్లారని యద్దేవా చేస్తుంటారు.జనసేనానిపై రోజా వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు జబర్దస్త్ ఫేం హైపర్ ఆది .. ప్రస్తుతం కూటమి అభ్యర్థులకు మద్దతుగా మద్దతు కూడ చేస్తున్న ఆది.. పవన్ గురించి మాట్లాడే అర్హత లేని వారు కూడా మాట్లాడుతున్నారని కౌంటర్ ఇచ్చారు. పవన్ వ్యక్తిత్వాన్ని ఆకాశానికెత్తేస్తూ మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ కులాన్ని తాకట్టుపెట్టారనడాన్ని తప్పుపట్టారు. రోజాకు పవన్ సైతం గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. యువగళం సభలో డైమంట్ రాణి అని యద్దేవా చేశారు.ఆ క్రమంలో హైపర్ ఆది ఎన్నికల ప్రచారంలో వైసీపీ మంత్రులకు తమ శాఖలేవో తెలియదని వ్యాఖ్యానించారు. దానిపై స్పందించిన రోజా.. పాపం చిన్న ఆర్టిస్టులు.. చిన్న చిన్న షోలు. పాత్రలు చేసుకొనేవారని తెగ జాలి కురిపించారు. వారిపై ఎందుకు ఈ ప్రతాపాలు.. వారి వెనుక ఎవరు ఉండి ఇవన్నీ అనిపిస్తున్నారో వారిని అనాలి. ఎన్నికల సభల్లో చిన్న చిన్న ఆర్టిస్టులను పిలిచి మాట్లాడించుకొనే పరిస్థితికి పవన్ దిగజారిపోయారని వారు కూడా మెగా కుటుంబంతో విరోధం పెట్టుకుంటే ఇండస్ట్రీలో లేకుండా చేస్తారేమో అన్న భయంతో ఏది మాట్లాడమంటే అది మాట్లాడుతున్నారని చెప్పుకొచ్చారు. మంత్రులకు అసలు శాఖలే తెలియవు అని అంటే.. శాఖలు తెలియకుండానే మంత్రులు ఎలా అయ్యామని ప్రశ్నించారు.ఇప్పటికే సినీ ఇండస్ట్రీని తొక్కేయడానికి జగన్ చూస్తున్నారన్న విమర్శలున్నాయి. సినిమా టికెట్ల వ్యవహారంలో చిరంజీవి, మహేష్‌బాబు, ప్రభాస్ వంటి స్టార్ హీరోలు తనకు కలవడానికి వచ్చినప్పుడు జగన్ వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది.. దానిపై ఇప్పటికీ సినీ ప్రముఖులు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు ? తాజాగా భారతీయుడు లాంటి మెగా హిట్లు నిర్మించిన ప్రొడ్యూసర్ ఏ ఎం రత్నం కూడా జగన్‌ని టార్గెట్ చేశారు. సినిమా పరిశ్రమ తొక్కాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించిందని రత్నం ఆరోపించారు.మరోవైపు హైపర్ ఆదిపై రోజా చేసిన వ్యాఖ్యలతో ఆమె అందరికీ టార్గెట్ అవుతున్నారు. జబర్దస్త్ ఫేమ్ ఆర్.పి. ఆమెపై ఒక రేంజ్లో విరుచుకుపడ్డారు. యువరాణి రోజా గొప్ప నటా? ఆస్కార్ అవార్డులు కొట్టిందా? కనీసం గెటప్ శీను , ఆది, సుధీర్ వంటి నటుల కోవలో స్కిట్స్ చేయగలదా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రోజా మాకు గౌరవం ఇస్తే .. మేము గౌరవిస్తాం. తమని చిన్న నటులని చులకన భావనతో మాట్లాడటం రోజాకు ఎంత మాత్రం తగదని హెచ్చరించారు.

# ఇంకా ఓటర్ స్లిప్ తీసుకోలేదా.. ఇలా మీ మొబైల్‌లోనే డౌన్‌లోడ్ చేసుకోండి!



తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. మరికొద్ది గంటల్లో ఎన్నికల పోలింగ్ మొదలవ్వనుండటంతో హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రజలు సొంతూళ్లకు పయనమయ్యారు. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే చాలామంది తమ ఓటర్ స్లిప్‌లను కూడా అందుకున్నారు. మన పోలింగ్ సెంటర్ ఏంటి? ఆ స్టేషన్‌లో మన రూమ్ నంబర్, సీరియల్ నంబర్ ఎంత అనే వివరాలు ఈ ఓటర్ స్లిప్‌లో ఉంటాయి కాబట్టి ఓటు వేసేయడం చాలా సులభమవుతుంది. అందుకే ఎన్నికలప్పుడు ఓటర్ స్లిప్ తీసుకోవడం చాలా ముఖ్యం. అయితే.. మీకు ఈ ఓటర్ స్లిప్ అందలేదా? అయితే టెన్షన్ పడాల్సిన అవసరమేమీ లేదు.. మీ చేతిలో ఉన్న మొబైల్ ద్వారానే ఓటర్ స్లిప్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**మొబైల్ బ్రౌజర్ ద్వారా..**
కంప్యూటర్ లేదా మొబైల్ బ్రౌజర్ నుంచి ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే ముందుగా https://electoralsearch.eci.gov.in/ లింక్‌పై క్లిక్ చేయాలి. అక్కడ ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఓటర్ ఐడీ, మొబైల్ నంబర్ లేదా పేరు, ప్రాంతం వంటి వివరాలను ఎంటర్ చేయడం ద్వారా ఓటర్ సమాచారాన్ని తెలుసుకోవచ్చు. పీడీఎఫ్ రూపంలో ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా డౌన్‌లోడ్ చేసుకున్న ఓటర్ స్లిప్‌ను ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది.

**మొబైల్ యాప్‌లో..**
ఇక మొబైల్ యాప్ ద్వారా ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకోవాలంటే.. మీ ఆండ్రాయిడ్ లేదా యాపిల్ మొబైల్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఎలక్టోరల్ రోల్ సెర్చ్ ఆప్షన్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయడం ద్వారా ఓటర్ స్లిప్ పొందవచ్చు. మొబైల్ నంబర్, ఓటర్ ఐడీతో పాటు పేరు, ఇతరత్రా వివరాలను ఎంటర్ చేయడం ద్వారా కూడా ఓటర్ స్లిప డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొబైల్ యాప్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మీ ఓటర్ ఐడీ పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఓటర్ స్లిప్‌ను సులభంగా పొందవచ్చు. అలా వచ్చిన సమాచారాన్ని వాట్సాప్, మెయిల్ ద్వారా కూడా షేర్ చేసుకోవచ్చు.

**మెసేజ్ ద్వారా కూడా..**
మెసేజ్ రూపంలో ఓటర్ స్లిప్ పొందడానికి %జుజ×% అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి.. ఓటర్ ఐడీ టైప్ చేసి 1950 నంబర్‌కు మెసేజ్ పంపించాలి. కాసేపటికే మీ పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ వంటి సమాచారం మొబైల్‌కు మెసేజ్ రూపంలో వస్తుంది.

# పోస్టల్ బ్యాలెట్.. ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

**విజయవాడ :** ఏపీ రాజకీయాలు సెగలు పుట్టిస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష కూటమిల మధ్య గట్టి యుద్ధమే నడుస్తోంది. మరోసారి అధికారమే లక్ష్యంగా వైసిపి అధినేత జగన్ పావులు కదుపుతున్నారు. వ్యూహాలు రూపొందిస్తున్నారు. ఎలాగైనా జగన్ ను అధికారం నుంచి దూరం చేయాలని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ వ్యూహరచన చేస్తున్నారు. బిజెపి మద్దతుతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఓటు కీలకంగా మారింది ముఖ్యంగా ఈసారి ఉద్యోగుల బ్యాలెట్ ఓటు ప్రాధాన్యత అంశంగా మారింది. పార్టీల గెలుపోటములను నిర్దేశించనుంది.ఏపీలో హోరా హోరీ ఫైట్ నేపథ్యంలో బ్యాలెట్ ఓటు కీలకంగా మారనుంది. తక్కువ ఓట్లతో గెలుపొటములు ఉంటాయని నిపుణులు భావిస్తున్న తరుణంలో బ్యాలెట్ ఓటు కీలక భూమిక పోషించనుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు డిసైడింగ్ ఫ్యాక్టర్ గా మారనున్నాయి. అందుకే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కి ఎన్నడూ లేనంత ప్రాధాన్యత పెరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈసారి శత శాతం ఓట్లు వేయడానికి మొగ్గు చూపించారు. ఈనెల 13న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. నాడు విధి నిర్వహణలో ఉండే ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ దాదాపు ఆరు రోజులు పాటు కొనసాగింది. ఈనెల నాలుగున ప్రారంభమైన ఓటింగ్ 10వ తేదీ వరకు కొనసాగుతూనే ఉంది. ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న లక్షలాదిమంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు 85 ఏళ్లు నిండిన వయోవృద్ధుల కోసం హోం ఓటింగ్ ఈసారి నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీరు చూస్తే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు




అధికార వైసీపీ పై ఉన్న అసహనం, ఆగ్రహం స్పష్టంగా కనబడింది. ఇప్పటివరకు అన్ని వర్గాలు తమ వైపు ఉన్నారని భావించిన వైసీపీకి గట్టి షాక్ తగిలింది.అటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో వైసిపి పై ఉన్న సానుకూలత క్రమేపి తగ్గుముఖం పడుతోంది. సోషల్ మీడియాలో సైతం వ్యతిరేక విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగ ఉపాధ్యాయ ఓట్లన్నీ తమకేనని నిన్న మొన్నటి వరకు ధీమాగా ఉన్న అధికార పార్టీ ఇప్పుడు చేతులెత్తేసింది. సమయానికి జీతాలు ఇవ్వకుండా ఉద్యోగులను తిప్పలు పెట్టారని.. టీచర్లకు వైన్ షాపుల వద్ద డ్యూటీలు వేశారని.. వారితో పాఠశాలల్లో మరుగుదొడ్లు కడిగించారని.. అన్ని శాఖల ఉద్యోగుల స్వేచ్ఛను హరించినందుకు.. తమ ఆగ్రహం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల రూపంలో ఉద్యోగ ఉపాధ్యాయులు చూపించారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో 2,38,468 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. 2024 ఎన్నికల్లో మే 4 నుంచి 8వ తేదీ వరకు 4,32,222 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. దాదాపు 5లక్షల ఓట్లు దాటతాయని అంచనా వేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి పూర్తి లెక్కలు వెలువడే అవకాశం ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐదు రోజులుగా నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్లలో క్యూలైన్లలో నిలబడి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు ప్రాంతాల్లో ఉద్యోగుల ఓట్లు గల్లంతు కావడంతో స్పాట్‌లో రిజిస్ట్రేషన్ చేసి ఓటు వేయడానికి ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. 8వ తేదీ వరకు 4,32,222 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.స్పష్టంగా చెప్పాలంటే పోస్టల్ బ్యాలెట్ లలో టిడిపి కూటమిదే పైచేయిగా కనిపిస్తోంది.అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని జగన్ విపక్షనేతగా హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. తన పాలన 30 నెలలు గడిచిన తర్వాత.. ప్రభుత్వముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా క్షమించండి అని జగన్ ప్రకటించారు. అదో సాంకేతిక అంశమని.. తెలియకుండా హామీ ఇచ్చానని.. తప్పయిపోయిందని ప్రకటన చేయించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, వసతులను సైతం రద్దు చేశారు. జీతాలు సైతం సక్రమంగా చెల్లించలేదు. ఇవన్నీ ప్రతికూలత చూపాయి. మరోసారి జగన్ అధికారంలోకి వస్తే ఉద్యోగ,ఉపాధ్యాయుల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందన్న ఆందోళన సర్వత్ర వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత.. కూటమి వైపు ఉద్యోగ, ఉపాధ్యాయులు మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది.

# అందరూ పిస్తా తినవచ్చా?



ఆరోగ్యం బాగుండాలి అంటే మంచి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. లేదంటే అనారోగ్య సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది. డ్రై ఫ్రూట్స్ వల్ల విటమిన్లు అందుతాయి.కానీ అందులో కొన్ని తినడం వల్ల మాత్రం కొందరికి మేలు జరగదు అంటున్నారు నిపుణులు. ఇక పిస్తా గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. మరి ఈ పిస్తాను ఎవరు తినాలి? ఎవరు తినకూడదు అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. పిస్తా పప్పులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాపర్, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్లు, విటమిన్ బీ6, ఫైబర్, కాల్షియం, ఐరన్ వంటివి ఎక్కువగా ఉంటాయి. వీటిని తింటే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. దీంతో అలసట, బలహీనతకు చెక్ చెప్పవచ్చు. ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొందరు పిస్తా పప్పు తినకూడదని వైద్యులు చెబుతున్నారు. ఇంతకీ ఎవరు తినకూడదు అంటే.. ఇటీవల కిడ్నీ సమస్యల కేసులు పెరుగుతున్నాయి. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటం అనేది సర్వసాధారణమైంది. ఇలాంటి వారు కూడా పిస్తా పప్పులు తినకూడదు. ఎందుకంటే వీటిలో ఆక్సలేట్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను మరింత పెంచుతుంది. దీన్ని తినడం వల్ల కిడ్నీల్లో రాళ్లు రావడం లేదా కిడ్నీల పని తీరు దెబ్బతినడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ప్రస్తుత టెక్ యుగంలో దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు పెరిగింది అనేది కాదనలేని వాస్తవం. పేలవ జీవనశైలి కారణంగా చాలామంది అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ సమస్య నుంచి బయట పడటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే బరువు తగ్గాలనుకునే వారు పిస్తా పప్పులు తినకూడదు. ఎందుకంటే వీటిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఇవి బరువును మరింత పెంచుతాయి. కొందరు రెగ్యూలర్ గా మందులు వాడుతుంటారు. అలాంటి వారు కూడా ఈ పిస్తాను తినకపోవడమే బెటర్. ఎందుకంటే ఇవి మందులతో చర్య జరిపి శరీరంపై దుష్ప్రభావాలు కలిగిస్తాయి. పిస్తాలను తినాలనుకుంటే ముందు జాగ్రత్తగా డాక్టర్‌ను సంప్రదించడం బెటర్. చాలా మందికి తినే ఆహారంపై సరైన అవగాహన ఉండటం లేదు. జంక్, స్పైసీ, ఫ్రైడ్, ప్యాక్డ్ ఫుడ్స్ అతిగా తింటున్నారు. దీంతో పొట్ట ఆరోగ్యం దెబ్బతిని జీర్ణ సమస్యలు తలెత్తున్నాయి. అయితే జీర్ణ సమస్యలతో బాధపడేవారు పిస్తా పప్పులు తినకూడదు. ఎందుకంటే ఇవి శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తాయి. ఫలితంగా అజీర్ణం, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యల రిస్క్ పెరుగుతుంది. నట్స్, సీడ్స్ కొందరికి పడవు. వీటిని తినడం వల్ల అలర్జీ సమస్యలు వస్తాయి, జీర్ణం అవడం కూడా చాలా ఇబ్బందిగా మారుతుంది. ఈ పిస్తా శరీరానికి వేడిని కలిగిస్తూ దురద వంటి చర్మ సమస్యలకు కారణం అవుతుంది కాబట్టి కాస్త జీర్ణ సమస్యలు ఉన్న వారు దూరంగా ఉండటం బెటర్.. ఒకవేళ తినాలనుకుంటే ముందుగా వైద్యుడిని సంప్రదించడం మంచిది అని గుర్తు పెట్టుకోండి. పిల్లలు కూడా వీటికి దూరంగా ఉండటం బెటర్. కొందరు సరిగ్గా నమలకుండానే తింటారు. దీంతో మింగేటప్పుడు పిస్తా లేదా దాని ముక్క గొంతులో ఇరుక్కుపోతే చాలా ఇబ్బంది అవుతుంది. అంతేకాదు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అందుకే చిన్న పిల్లలకు పిస్తాలు ఇవ్వకపోవడం మంచిది.

# అధిక బరువుతో బాధపడుతున్నారా?

అధిక బరువు ఉండటం ఎప్పుడు సమస్యనే. ఇలా బరువు ఉండటం ఎవరికి నచ్చదు కూడా. అందుకే బరువు తగ్గేందుకు చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇది పైకి తేలికగా కనిపించినప్పటికీ, చాలామందికి ఇది సాహసంలా కనిపిస్తుంది. కొందరు జిమ్, యోగా, డైట్, వర్కవుట్ వంటివి చేస్తూ సన్నగా మారడానికి ప్రయత్నిస్తుంటారు. మరికొందరు డైట్ పాటిస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా సరే ఓ రెండు కిలోలు మాత్రమే తగ్గుతారు. మరి మీ బరువు తగ్గాలి అంటే ఏం చేయాలో ఓ సారి చూడండి. ఊబకాయం ఉంటే మధుమేహం, అధిక రక్తపోటు , కొలెస్ట్రాల్ వంటి సమస్యలను మరింత పెంచుతాయి. కాబట్టి ఊబకాయంతో బాధపడేవారు వీలైనంత త్వరగా బరువు తగ్గడం మంచిది. అందుకే బరువు తగ్గడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ను తీసుకోవచ్చు. మరి దీన్ని ఎలా ఉపయోగించాలి? అనే వివరాలు తెలుసుకోవాలంటే ఈస్టోరీ ఫాలో అవండి. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నప్పుడు మనం సైడ్ ఎఫెక్ట్స్ కు గురికాకుండా ఉండటం కూడా చాలా ముఖ్యం. కాబట్టి సహజ మార్గాల ద్వారా బరువు తగ్గడమే చాలా మంచిది అని గుర్తు పెట్టుకోండి. బరువు తగ్గడానికి మొదటి అడుగు తక్కువ కేలరీల ఆహారం తీసుకోవడం. కొన్ని శక్తివంతమైన పానీయాలు తాగడం వల్ల మీరు తేలికగా బరువు తగ్గవచ్చు. అటువంటి పానీయమే ఆపిల్ సైడర్ వెనిగర్. గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో 2 క్యాప్ఫుల్స్ యాపిల్ సైడర్ వెనిగర్ బాగా కలిపి తీసుకోవాలి. భోజనానికి 15 నిమిషాల ముందు కూడా దీన్ని తీసుకోవచ్చు. ఎందుకంటే ఇది ఆహారం బాగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. కాబట్టి ఈ డ్రింక్‌ను తరచుగా తీసుకోకూడదని గుర్తుంచుకోండి. బరువు తగ్గడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో కూడా తెలుసుకుందాం. బరువు తగ్గాలనుకునే వారు రోజూ యాపిల్ సైడర్ వెనిగర్ తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ విధంగా మీరు కేలరీలను తగ్గించవచ్చు, కొవ్వును కరిగించవచ్చు మరియు వేగంగా బరువు తగ్గవచ్చు. ఈ అద్భుతమైన పానీయం అనేక విధాలుగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది అప్పుడప్పుడు ఆకలి బాధలను అరికడుతుంది. అనవసరమైన అనారోగ్యకరమైన ఆహారాన్ని నిరోధిస్తుంది. దీన్ని తాగడం వల్ల అదనపు కేలరీలు తీసుకోకుండా ఉంటాం.



# ప్రాసెస్ట్ ఫుడ్ తరచూ తింటున్నారా?



మనలో చాలా మంది ప్రాసెస్ట్ ఫుడ్ ను ఎక్కువగా తింటుంటారు. స్నాక్స్, చిప్స్, మ్యాగీ వంటి పదార్థాలు ఇష్టంగా లాగించేస్తుంటారు. అంతేకాదు చల్లగా ఉన్నాయంటూ కూల్ డ్రింక్స్ ను కూడా ఎక్కువగా తాగేస్తుంటారు.అయితే ఈ విధంగా తినడం, తాగడంతో ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే.. అదేంటి? అనుకుంటున్నారా? నిజమేనండి. ప్రాసెస్డ్ ఫుడ్ తినేవారి జీవిత కాలం తగ్గుతుందంట.ప్రస్తుత బిజీ కాలంలో ఏది అందుబాటులో ఉంటే దాన్నే తినేస్తున్నారు. టైం సరిగా లేకపోవడంతో టిఫిన్ మొదలుకుని భోజం వరకు చాలా వరకు ప్రాసెస్డ్ ఆహారం మీదే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పుకోవచ్చు. ఈ క్రమంలోనే ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్, వివిధ రకాల స్నాక్స్ ఇలా అందుబాటులో ఉన్న వాటితో సరిపెట్టుకుంటున్నారు. పట్టణాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ప్రాసెస్డ్ ఫుడ్ ను తీసుకోవడం వలన జీవిత కాలం తగ్గడంతో పాటు అకాల మరణం కూడా సంభవించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉప్పు, చక్కెర మరియు కొవ్వు అధికంగా ఉండే ఈ ఫుడ్ ను తరచూ తినడం వలన శరీరానికి తగిన పోషకాలు అందవని తాజా అధ్యయనాలలో వెల్లడైందని తెలియజేస్తున్నారు. ఈ కారణంగానే బీపీ, మధుమేహంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు మరియు క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. అంతేకాదు చిప్స్, బిస్కెట్ల వంటి అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారం తినడం వలన శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. ఇది చివరికి ప్రాణాపాయానికి దారి తీస్తుందని నిపుణులు తెలిపారు. దాంతోపాటుగా గుండె జబ్బులు, మూత్ర పిండాల వ్యాధి వంటి పలు సమస్యల బారిన పడే ఛాన్స్ ఉంది. అదేవిధంగా మెటబాలిక్ సింద్రోమ్, స్థూలకాయం, ముసలితనం వంటి అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అధ్యయనాల్లో వెల్లడైంది. అందుకే రోజువారీ ఆహారంలో పది శాతం కన్నా ఎక్కువగా ఇటువంటి ఫుడ్ ను తీసుకోరాదని హెచ్చరిస్తున్నారు.

# ప్రోటీన్ పౌడర్‌తో పరేషానే!



ఈ రోజుల్లో యువత మార్కెట్లో దొరికే ప్రోటీన్ పౌడర్ తీసుకోవడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా జిమ్‌కి వెళ్లే యువత ఎక్కువగా ప్రోటీన్లు తీసుకుంటున్నారు. కారణం జిమ్‌కి వెళ్లి, వర్కవుట్‌లపై చేసినప్పుడు, కండరాలను నిర్మించడానికి శరీరానికి ప్రోటీన్ ఇవ్వడం అవసరం. దీని కోసం, తరుచుగా ఈ సప్లిమెంట్లను ఆశ్రయిస్తారు. ఈ ప్రోటీన్ పౌడర్ వాడకం వల్ల అనారోగ్యానికి గురవుతారని నిపుణులు చెబుతున్నా కూడా వందలు ఖర్చుపెట్టి పౌడర్ కొంటున్నారు. మరోవైపు అథెట్లు సైతం సప్లిమెంట్స్ వాడవద్దని చెబుతున్నారు. అయితే, ప్రోటీన్ పౌడర్ సప్లిమెంట్లపై హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసీఎంఆర్) తాజాగా కీలక హెల్త్ అలర్ట్ ఇచ్చింది. సాధారణ ప్రజలకు, క్రీడాకారులకు ప్రోటీన్ సప్లిమెంట్ల వినియోగానికి వ్యతిరేకంగా సలహా ఇచ్చింది. ప్రోటీన్ సప్లిమెంట్లలో గుడ్లు, పాలు, పాల విరుగుడు, సోయాబీన్స్, బఠానీలు, బియ్యం వంటి వివిధ వనరుల నుంచి తయారు చేస్తారన్నారు. వాటితో పాటు చక్కెరలు, కృత్రిమ స్వీటెనర్లు, ఫ్లేవర్స్ కలిగి ఉంటాయని తెలిపింది. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడానికి సిఫారసు చేయబడలేదని పేర్కొంది. పాలవిరుగుడు ప్రోటీన్, ఈ సప్లిమెంట్లలో ఒక సాధారణ పదార్థం, బ్రాంచ్-చైన్ అమైనో ఆమ్లాలలో (బీసీఏఏఎస్) అధికంగా ఉంటుంది. ఇటీవల చేసిన అధ్యయనాల్లో అధిక బీసీఏఏలు నాన్-కమ్యూనికేబుల్ వ్యాధుల (ఎన్‌సీడీఎస్) ప్రమాదాన్ని పెంచుతాయని తేలింది. అధిక స్థాయిలో ప్రోటీన్ తీసుకోవడం, ముఖ్యంగా సప్లిమెంట్ పౌడర్లు అనవసరం, హానికరం అని ఐసీఎంఆర్ నొక్కి చెప్పింది. ప్రోటీన్ తీసుకునే వారు సప్లిమెంట్లపై ఆధారపడకుండా, సమతుల్య ఆహారం ద్వారా వారి ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించింది.

# మునగతో ఈ 5 వ్యాధులకు చెక్..

మలబద్ధకం, స్థూలకాయం, అనేక కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి శారీరక సమస్యలన్నింటికీ సహజసిద్ధమైన ఔషధం కూరగాయలో దాగి ఉంది. ఈ వెజిటేబుల్ తో ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందవచ్చట. మరి ఆ ఔషధం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఎన్నో ఔషధగుణాలు కలిగిన వెజిటేబుల్ మునక్కాయి. దీనిని డ్రమ్ స్టిక్ అని కూడా పిలుస్తారు. మునగ కాయ, దాని ఆకులు అద్భుతమైన గుణాలతో నిండి ఉన్నాయి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం మలబద్ధకం, ఊబకాయం, కడుపు సమస్యలు, రక్తపోటు, మధుమేహం, అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడంలో మునగను ఉపయోగించడం మంచిదంటున్నారు. ఇందులో అధిక మొత్తంలో ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్లు ఉంటాయి. ఇందులో లభించే విటమిన్ సి పరిమాణం నారింజ కంటే ఎక్కువగా ఉందని, పాలలో కంటే కాల్షియం పరిమాణం ఎక్కువగా ఉందని అనేక పరిశోధనల్లో కూడా తెలిసింది. దాని ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. బరువు అదుపులో..మొరింగలో ఫైబర్, ప్రోటీన్, ఎక్కువ పోషకాలు ఉంటాయి. అలాగే కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నియంత్రణ చేసేందుకు సహాయపడుతుంది. మునగను బరువు తగ్గేందుకు సూప్ లేదా జ్యూస్ రూపంలో తీసుకుంటే మరింత మేలు జరుగుతుంది.మధుమేహానికి మునగ ఆకులు..మునగ ఆకులు మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. ఎందుకంటే దాని ఆకులలో ఐసోథియోసైనేట్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని పెంచడానికి అనుమతించదు.క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది..యాంటీ క్యాన్సర్, యాంటీ ట్యూమర్ లక్షణాలు మునగలో ఉన్నాయి. దాని ఆకులలో అధిక మొత్తంలో పాలీఫెనాల్స్ యాంటీఆక్సిడెంట్లు కూడా కనిపిస్తాయి. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని నివారిస్తుంది. రక్తపోటు అదుపులో.. మొరింగలో ఉండే ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇందులో ఉండే విటమిన్ సి, విటమిన్ ఎ, బీటా కెరోటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు కూడా రక్తపోటు పెరగనివ్వదు. ఎముకలకు మునగ.. మునగకాయ తీసుకోవడం ఎముకలకు



కూడా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో మంచి మొత్తంలో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ ఉంటాయి. ఎముక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి.

స్థానిక వార్తలు

## 5.8 శాతం పెరిగిన పరిశ్రమల ఉత్పత్తి.. గతేడాది కంటే 0.6 శాతం అధికం



ఇంటర్నెట్ డెస్క్: 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ పరిశ్రమల్లో ఉత్పత్తి 5.8 శాతం పెరిగినట్లు ప్రభుత్వానికి చెందిన నేషనల్ స్టాటికల్ ఆఫీస్ డేటా వెల్లడించింది. ఒక్క మార్చి నెలలోనే ఏకంగా 4.9 శాతం ఉత్పత్తులు పెరిగాయని గతేడాది అదే సమయానికి కేవలం 1.9 శాతంగానే ఉత్పత్తులు జరిగాయని తేలింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5.2 శాతం ఉత్పత్తులు జరగ్గా.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 0.6 శాతం ఉత్పత్తులు పెరగడంపై పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మైనింగ్ ఉత్పత్తులు 1.2 శాతం, విద్యుత్తు ఉత్పత్తులు 8.6 శాతం పెరిగాయి. ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్(%×ఖూ%)లో గత ఆర్థిక సంవత్సరంలో 5.2 వృద్ధి శాతం నమోదు చేయగా, 2023-24లో అత్యధికంగా 5.8 వృద్ధి నమోదైంది.

## మళ్లీ తగ్గిన బంగారం, వెండి ధరలు..ఎంతకు చేరాయంటే

భారతదేశంలో ఈరోజు (మే 12న) బంగారం(%స్త్రశీశ్రీ్రస%) ధరలు స్థిరంగా ఉన్నాయి. కానీ మే 11న సాయంత్రం బంగారం ధరలు దాదాపు రూ.300కుపైగా తగ్గాయి. ఈ నేపథ్యంలో నేడు ఢిల్లీ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.73,510గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ. 67,400కు చేరుకుంది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.73,360గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 67,250కి చేరింది. మరోవైపు వెండి ధర కూడా రూ.800 తగ్గింది.

ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధరలు

ఢిల్లీలో బంగారం ధర రూ. 73,510, ధర రూ. 67,400

హైదరాబాద్‌లో బంగారం ధర రూ. 73,360, ధర రూ. 67,250

విజయవాడలో బంగారం ధర రూ. 73,360, ధర రూ. 67,250

చెన్నైలో బంగారం ధర రూ. 73,640, ధర రూ. 67,500

ముంబైలో బంగారం ధర రూ. 73,360, ధర రూ. 67,250

కోల్‌కతాలో బంగారం ధర రూ. 73,360, ధర రూ. 67,250


నేడు వెండి ధరలు

ఈ క్రమంలో వెండి(%ంఱశ్రీఙవతీ%) రేట్లు కూడా ఈరోజు రూ. 800 తగ్గాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కేజీ వెండి రేటు రూ.87,000గా ఉంది. హైదరాబాద్‌లో కేజీ వెండి రూ. 90,500, ముంబైలో రూ. 87,000, బెంగళూరులో రూ. 87,100, కోల్‌కతాలో రూ. 87,000, చెన్నైలో రూ. 90,500కు చేరుకుంది.

## అత్యవసర పరిస్థితుల్లో డబ్బులకు ఇబ్బంది పడొద్దా..

# అయితే ఈ టిప్స్ ఫాలో అవ్వండి!

కొన్ని సందర్భాల్లో కొద్దిరోజుల వ్యవధిలో, కొద్దిగంటల వ్యవధిలోనే డబ్బు అవసరం కావచ్చు. అత్యవసర పరిస్థితులు ఎప్పుడూ తెలియకుండానే వస్తాయి. అందుకే దానిని ఎదుర్కోవడానికి ముందుగానే ప్లాన్ చేసుకోవాలని చెప్పేవాళ్లే ఎక్కువ. అయితే ఎమర్జెన్సీ ఫండ్ లక్ష్యం ఆర్థిక అవసరం తీర్చడమే! ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవటానికి ప్రత్యేకంగా కొంత నిధి ఉండాలని చెప్తుంటారు. ఆ నిధి ఏ రూపంలో ఉండాలి? నగదు రూపంలోనే ఉండాలా? మరేదైనా రూపంలో ఉన్నా అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవడానికి వీలుంటుందా? చూద్దాం అసలు అత్యవసర నిధి అంటే ఏమిటి? దాన్ని ఎలా నిర్వహించుకోవాలి? మన సంపాదనలో ఎంత భాగాన్ని అత్యవసర నిధిగా పక్కన పెట్టుకోవాలి? తదితర సందేహాలు చాలామందిని తరుచూ తొలిచివేస్తూ ఉంటాయి. ఒకరిద్దరు మినహా అత్యవసర సమయాల్లో చాలామంది అప్పు కోసం రాక్షస ప్రయత్నం చేస్తుంటారు. చివరికి 'వడ్డీ ఎంతైనా ఫర్వాలేదు' అని అందినకాడికి అప్పులు చేస్తుంటారు. సంపన్నులు సైతం అత్యవసర పరిస్థితుల్లో చేతిలో సరిపడా క్యాష్‌లేక ఆస్తులను అడ్డెకు పావుసేరు రేటుకు అమ్ముకుంటుంటారు. అయితే, ప్రతి వ్యక్తికీ, కుటుంబానికీ ఎమర్జెన్సీ ఫండ్ ఉండాలి. అలాగని నగదు రూపంలోనే ఈ ఫండ్ ఉండాలన్న నియమం లేదు. ఏ రూపంలో ఉన్నా.. అవసరానికి అక్కరకు రావాలి. ఒక వ్యక్తి జీవితంలో ఏది అత్యవసర పరిస్థితికి దారితీస్తుందో ఆలోచించాలి. కారు చెడిపోయిందా.. రెండు వారాల్లో బాగు చేసుకోవచ్చు. ఉద్యోగం పోయిందా.. మహా అయితే నాలుగు నెలల్లో తిరిగి సంపాదించుకోవచ్చు. ఇవన్నీ ఈ రోజుల్లో అత్యవసర పరిస్థితులు అనలేం. ఇంటి ఖర్చులే కాకుండా, ఈఎంఐలు లేదా క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించడం వంటి ఆర్థిక బాధ్యతలను నెరవేర్చేందుకు కొన్ని నెలలకు సరిపడా అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలని కొందరు




సూచిస్తుంటారు. ఎంత చెట్టుకు అంత గాలి. వ్యాపారులు మినహా.. మూడు నెలల ఖర్చులకు సరిపడా నగదు ఏ ఉద్యోగీ బ్యాంకు ఖాతాలో ఉంచలేడు. ఏ నెల ఖర్చులు ఆ నెల ఎగిరిపోతూనే ఉంటాయి. సేవింగ్స్ ఖాతా చిక్కిపోతే క్రెడిట్ కార్డుతో అవసరాలు తీర్చుకుంటారు. మరీ సమస్యాత్మకమైతే బంగారం కుదువపెట్టి ఎమర్జెన్సీ ఫండ్ సమకూర్చుకుంటున్నారు. అసలు ఎమర్జెన్సీ ఫండ్ అంటే.. మన కుటుంబ పరిస్థితి తారుమారు కాకుండా కాపాడే నిధి. మనం పోయిన తర్వాత కూడా కుటుంబాన్ని భద్రంగా ఉంచే మొత్తం. ఆరోగ్య బీమా, జీవిత బీమా ఈ రెండిటినీ మించిన ఎమర్జెన్సీ ఫండ్స్ లేవు. ప్రాణాలను నిలబెట్టుకోవడం కన్నా అత్యవసర పరిస్థితి ఏముంటుంది? కుటుంబాన్ని కాపాడుకోవడం కన్నా గొప్ప అవసరం ఏముంటుంది? కానీ, ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అన్నీ అందుబాటులో ఉన్నప్పుడు వీటి గురించి ఎవరూ ఆలోచించరు. తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకొని అత్యవసర నిధి దొరక్క అతలాకుతలం అవుతుంటారు. ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రి పాలైనప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ చేసి ఉంటే బాగుండేది కదా! అనుకునేవాళ్లు చాలామంది ఉంటారు. ఈ రోజుల్లో రకరకాల వ్యాధులు మనిషి వెన్నంటే ఉంటున్నాయి. హెల్త్ చెకప్ కోసం వెళ్లిన వ్యక్తి.. కార్పొరేట్ ఆస్పత్రిలో జాయిన్ అవుతున్న సందర్భాలూ ఉంటున్నాయి. కిడ్నీ, గుండె, లివర్ రుగ్మతలతో ఆస్పత్రి గుమ్మం తొక్కితే.. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తున్నది. పాతికేండ్లు ఉద్యోగం చేసినా%శొ% దవాఖాన ఖర్చుకు వెరచి వెనుదిరుగుతున్న వాళ్లూ ఉన్నారు. ఎప్పుడో అగ్గువకు కొన్న ప్లాటు బేరానికి పెడితే.. బయ్యర్ దొరికే వరకు చికిత్స అందేదెలా? ఏడాదికి పాతికవేలు ఖర్చుపెట్టి ఓ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే.. ఆ భరోసా వైద్యం కన్నా వేగంగా గుణం చూపిస్తుంది కదా! ఎమర్జెన్సీ ఫండ్ అనేది నేచర్ ఆఫ్ వర్క్‌ను బట్టి మారిపోతుంది. సూటిగా చెప్పాలంటే ఈ రోజుల్లో కుటుంబ సభ్యులందరికీ ఒక్కొక్కరి పేరు మీదా రూ.50 లక్షలకు తగ్గని హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడమే ఎమర్జెన్సీ ఫండ్. అత్యవసరం అనే పదానికి అర్థం.. అన్ ఎక్స్‌పెక్టెడ్, డేంజరస్ సిచువేషన్, రిక్వైరింగ్ ఇమిడియట్ యాక్షన్ అని! ఏదైనా ప్రమాదం జరగడం, కార్డియాక్ అరెస్ట్, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి పడిపోవడం లాంటివి అత్యవసర పరిస్థితులు. ఇలాంటప్పుడు కదా ఎమర్జెన్సీ ఫండ్ ఉపయోగపడాల్సింది. మరి ఆర్నెల్లకు సరిపడా ఖర్చులు పక్కన పెట్టుకోవడానికి, దీనికి ఏమైనా సంబంధం ఉందా? జాబ్ పోవడం అనేది సీరియస్, అన్ ఎక్స్‌పెక్టెడ్, డేంజరస్ సిచువేషన్ కాదు. ఈ జాబ్ పోతే మరో జాబ్ వస్తుంది. నగదు రూపేణా బ్యాంకుల్లో దాచుకునేది, స్థిర ఆస్తుల రూపంలో నిర్వహించేది అత్యవసర నిధి కాదు. కుటుంబంలో ఎవరికి ప్రాణాపాయ స్థితి వచ్చినా కాపాడుకోగల 'పాలసీ' ఏదైనా అసలు సిసలు అత్యవసర నిధే. కనీసం ఐదేండ్లకు సరిపడా సొమ్ము, దానంత విలువైన సంపదే అత్యవసర నిధి.

## అంబాసిడర్ కారు మళ్లీ వస్తోంది!

**న్యూఢిల్లీ :** ఒకప్పుడు దేశీయ రోడ్లపై దూసుకుపోయిన అంబాసిడర్ కారు మళ్లీ వస్తోంది. హిందుస్థాన్ మోటర్ సంస్థ ఈ నయా అంబాసిడర్ కారుకు తుది మెరుపులు దిద్దుతున్నది. దేశీయ మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఈ మాడల్‌ను దశాబ్దాల క్రితం సంస్థ నిలిపివేసింది. ఆటోమొబైల్ రంగంలోకి ఎన్నో కంపెనీలు ప్రవేశించడం, ఈ పాత మాడల్‌కు ఆదరణ తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం ఈ నయా మాడల్‌ను తిరిగి విడుదల చేయడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. దీంతోపాటు అంబాసిడర్‌లోనే ఈవీని ప్రవేశపెట్టే ఉద్దేశంలో సంస్థ ఉన్నది. ఇందుకోసం సంస్థ యూరోపియన్‌కు చెందిన కంపెనీతో కలిసి పనిచేస్తున్నది. తొలి దశలో ద్విచక్ర వాహనాన్ని, ఆ తర్వాతి క్రమంలో నాలుగుచక్రాల వాహనాన్ని విడుదల చేయనున్నది. ఇందుకోసం రూ.300-400 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నది.




స్పోర్ట్స్

# చేజేతులా ఓడిన ఢిల్లీ..







ప్లే ఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా ఐదో విక్టరీ కొట్టింది. కీలకమైన రెండు పాయింట్ల కోసం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఢిల్లీ చిత్తుగా ఓడింది. తొలుత రజత్ పాటిదార్(52), విల్ జాక్స్(41) విధ్వంసంతో ఆర్సీబీ భారీ స్కోర్ చేయగా.. ఛేదనలో ఢిల్లీ ఆది నుంచి తడబడింది. బెంగళూరు బౌలర్లు, ఫీల్డర్ల జోరుతో వరుసగా వికెట్లు కోల్పోయి 140కే కుప్పకూలింది. కెప్టెన్ రిషభ్ పంత్ గైర్హాజరీలో పగ్గాలు అందుకున్న అక్షర్ పటేల్(57) అర్ధ శతకంతో చెలరేగినా ఢిల్లీని గెలిపించలేకపోయాడు. వరుసగా ఐదో విజయం నమోదు చేసిన డూప్లెసిస్ సేన 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని ఐదో స్థానానికి ఎగబాకింది. చిన్నస్వామి స్టేడియంలో రజత్ పాటిదార్(52), విల్ జాక్స్(41) మెరుపులతో ఆర్సీబీ 186 రన్స్ కొట్టింది. అనంతరం ఛేజింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. తొలి ఓవర్లోనే ఇంప్యాక్ట్ ప్లేయర్ డేవిడ్ వార్నర్(1) ఔటయ్యాడు. అతడితో మొదలు వచ్చిన వాళ్లు వచ్చినట్టు డగౌట్‌కు క్యూ కట్టారు. యశ్ దయాల్ ఓవర్లో నాన్ స్ట్రయికర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(21) దురదృష్టం కొద్దీ రనౌట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు బంతికి అభిషేక్ పొరెల్(7) సులవైన క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత సిరాజ్ బౌలింగ్‌లో కుమార్ కుషగ్ర(2) ఎల్బీగా దొరికాడు. దాంతో, 30 పరుగులకే ఢిల్లీ 4 వికెట్లు కోల్పోయింది. ఆ దశలో ఢిల్లీని గట్టున పడేసే బాధ్యత తీసుకున్న షాహ్ హెూప్(27), కెప్టెన్ అక్షర్ పటేల్(57)లు ఐదో వికెట్‌కు 56 రన్స్ జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడదీసిన ఫెర్గూసన్ ఢిల్లీని ఓటమి అంచుల్లోకి నెట్టాడు. గ్రీన్ ఓవర్లో లేని పరుగుకు ప్రయత్నించిన ట్రిస్టన్ స్టబ్స్(3) అనూహ్యంగా రనౌట్ కావడంతో 90 పరుగులకే ఢిల్లీ ఆరో వికెట్ పడింది.

**పట్టువదలని విక్రమార్కుడిలా..**

అయినా సరే.. అక్షర్ పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి ఢిల్లీ స్కోర్ 120 దాటించాడు. అయితే.. బంతి అందుకున్న దయాల్ అతడిని వెనక్కి పంపి ఆర్సీబీని గెలుపు వాకిట నిలిపాడు. ఆఖరి ఓవర్‌లో తొలి బంతికే దయాల్ .. కుల్దీప్ యాదవ్(6)ను బౌల్డ్ చేయడంతో 140 పరుగులకు ఢిల్లీ ఆలౌటయ్యింది. దాంతో, ఆర్సీబీ 47 పరుగుల తేడాతో గెలుపొంది ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది.

**పాటిదార్, జాక్స్ విధ్వంసం**

ప్లే ఆఫ్స్ ఆశలు సన్నగిల్లిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు చితక్కొట్టారు. చిన్నస్వామి స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను ఉతికేస్తూ ఆర్సీబీ రజత్ పాటిదార్(52) విధ్వంసం సృష్టించాడు. 36 పరుగులకే ఫాఫ్ డూప్లెసిస్ (6), విరాట్ కోహ్లీ(27) లు వెనుదిరగడంతో ఒత్తిడిలో పడిన ఆర్సీబీని ఆదుకున్నాడు. అర్ధ సెంచరీతో చెలరేగిన పాటిదార్.. డేంజరస్ విల్ జాక్స్(41)తో 88 రన్స్ జోడించాడు. చివర్లో కామెరూన్ గ్రీన్(30 నాటౌట్) దంచడంతో, ఆర్సీబీ ప్రత్యర్థి ముందు 188 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఢిల్లీ బౌలర్లలో ఖలీల్ అహ్మద్(2/31), రసిక్ సలాం(2/23)లు రాణించారు.

## దీక్ష సరికొత్త రికార్డు



**ఢిల్లీ:** భారత ట్రాక్ అథ్లెట్ కెఎం దీక్ష మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో సరికొత్త జాతీయ రికార్డు సృష్టించింది. లాస్ ఏంజెల్స్ వేదికగా జరుగుతున్న సౌండ్ రన్నింగ్ ట్రాక్ ఫెస్ట్‌లో భాగంగా శనివారం ముగిసిన ఫైనల్ రేసును 4:4.78 నిమిషాలలో పూర్తిచేసిన దీక్ష మూడో స్థానంలో నిలిచింది. 2021లో హర్మిలన్ బెయిన్స్ నెలకొల్పిన 4:05.39 నిమిషాల రికార్డును బ్రేక్ చేసింది. ఇదే టోర్నీలో మహిళల 5 వేల మీటర్ల రేసును పారుల్ చౌదరి 15:10.69 నిమిషాల్లో పూర్తిచేసి ఐదో స్థానం దక్కించుకుంది. పురుషుల 5 వేల మీటర్ల రేసులో అవినాష్ సాబ్లె.. 13:19.30 నిమిషాల్లో పూర్తిచేసి పదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

## పర్వేజ్ ఖాన్‌కు స్వర్ణం




**ఫ్లోరిడా:** భారత యువ అథ్లెట్ పర్వేజ్ ఖాన్ ఫ్లోరిడావేదికగా జరుగుతున్న సౌత్‌ఈస్టర్న్ కాన్ఫరెన్స్ ఔట్‌డోర్ ట్రాక్ అండ్ ఫీల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచాడు. పురుషుల 1500 మీటర్ల రేసును పర్వేజ్.. 3 నిమిషాల 42.73 నిమిషాల్లోనే పూర్తిచేసి పసిడి నెగ్గాడు. హర్యానాలోని మేవాత్ జిల్లా చహల్క గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన 19 ఏండ్ల కుర్రాడు.. ఇదే టోర్నీ 800 మీటర్ల రేసులో కాంస్యం సాధించాడు.




# యాక్షన్ సీక్వెన్స్‌లో మిస్టర్ బచ్చన్

టాలీవుడ్ కథానాయకుడు రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్ పోస్టర్‌లో రవితేజ తన ఫేవరేట్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ పోజ్‌లో కనిపిస్తూ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాడు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ నేపథ్యంలో సాగే సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. మరోవైపు మిస్టర్ బచ్చన్‌ను జులైలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దీనిపై చిత్రయూనిట్ నుంచి ప్రకటన వెలుబడాల్సి ఉంది. మిరపకాయ్ సినిమా తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. రవితేజ ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా కనిపించనున్నాడు. ఈ చిత్రానికి కెమెరా: ఆయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ-సిరీస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచన-దర్శకత్వం: హరీశ్ శంకర్.



## బాలీవుడ్ కెరీర్‌పై జూనియర్ ఎన్టీఆర్ స్పెషల్ ఫోకస్..

ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు జూనియర్ ఎన్టీఆర్ ఈ స్టార్ యాక్టర్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ భారీ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి కొరటాల శివ దర్శకత్వంలో నటిస్తోన్న దేవర. ఈ మూవీతో తారక్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. మరోవైపు అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం వార్ 2. హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. బాలీవుడ్‌లో కెరీర్‌ను సక్సెస్‌ఫుల్‌గా ముందుకు తీసుకెళ్లేందుకు తారక్ ఓ టాప్ ఏజెన్సీని నియమించుకున్నట్టు వార్త ఒకటి బీటౌన్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఈ ఏజెన్సీ తారక్‌కు యాడ్స్ (వాణిజ్య ప్రకటనలు) తీసుకురావడంతోపాటు అతడి హిందీ సినిమాలకు సంబంధించిన వ్యవహారాలు చూసుకోనుందట. రానున్న రోజుల్లో వార్ 2 సినిమా తర్వాత ఎన్టీఆర్‌కు బీటౌన్‌లో క్రేజ్ మరింత పెరిగిపోవడం పక్కా అని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. తెరకెక్కుతున్ను వార్ 2లో తారక్ నెగెటివ్ షేడ్స్‌తో సాగే స్పై రోల్‌లో కనిపించనున్నాడని ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన వార్ 2 గ్లింప్స్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీని 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఇప్పటికే ఆస్కార్స్ రేసులో ఆర్ఆర్ఆర్‌కు గాను టాప్ -10 బెస్ట్ యాక్టర్లలో స్థానం సంపాదించుకున్న తొలి భారతీయ నటుడిగా రికార్డు సృష్టించాడని తెలిసిందే.

# డ్యుయల్ రోల్‌లో విజయ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ దేవరకొండ రీసెంట్‌గా తన పుట్టినరోజు సందర్భంగా బ్యాక్ టు బ్యాక్ సినిమాల అప్‌డేట్స్ అందించాడని తెలిసిందే. ఈ ఫ్యామిలీ స్టార్ హీరో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో నటిస్తున్న సినిమా %ఎణ%14. టాక్సీవాలా ఫేం రాహుల్ సంకీర్త్యన్ ఈ మూవీని డైరెక్ట్ చేస్తున్నాడు. ఇతిహాసాలు రాయలేదు.. అవి హీరోల రక్తంలో ఇమిడిపోయాయి.. అంటూ మేకర్స్ షేర్ చేసిన లుక్ ఒకటి ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో విజయ్ దేవరకొండ డ్యుయల్ రోల్‌లో కనిపించబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ పాత్రల్లో ఒకటి ..యుద్ధవీరుడిగా కనిపించనున్నాడట. ప్రస్తుతానికి దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ.. ఈ న్యూస్‌ను మాత్రం తెగ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు. బీటలు వారిన నేలపై గుర్రపు స్వారీ చేస్తున్న ఓ లెజెండ్ కథను సిల్వర్ స్క్రీన్‌పై చూపించబోతున్నట్టు ప్రకటించారు. 1854-1878 మధ్యకాలంలో సాగే కథతో సినిమా రాబోతున్నట్టు ప్రీ లుక్ పోస్టర్‌తో తెలియజేశారు మేకర్స్. ఇంతకీ విజయ్ దేవరకొండ పోషించబోతున్న ఆ లెజెండ్ పాత్ర ఎవరిదన్న దానిపై సస్పెన్స్ నెలకొంది. సినిమాలో ఎవరి ఇతిహాస గాథను చూపించబోతున్నారనే దానిపై మేకర్స్ రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు. విజయ్ దేవరకొండ మరోవైపు గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో కాప్ డ్రామా వీడీ 12లో కూడా నటిస్తున్నాడు. ఈ మూవీ వైజాగ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. దీంతోపాటు రవికిరణ్ కోలా డైరెక్షన్‌లో కూడా సినిమా చేస్తున్నాడు.





# తెన్‌కాశిలో సందడి చేస్తున్న విక్రమ్ 'వీర ధీర శూరన్' టీమ్

తమిళ విలక్షణ నటుడు చియాన్ విక్రమ్ తంగలాన్ తర్వాత వరుస ప్రాజెక్ట్‌లను ఒకే చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఒకటి 'వీర ధీర శూరన్'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై రియా శిబు నిర్మిస్తుంది. విక్రమ్ బర్త్ డే సందర్భంగా ఇటీవలే టైటిల్ టీజర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ సినిమాకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం తమిళనాడు పశ్చిమ కనుమల్లోని అతి సుందరమైన తెన్‌కాశిలో జరుగుతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ మూవీలోని ప్రధాన భాగం ఇక్కడనే షూటింగ్ జరుపుకోనున్నట్లు తెలిపింది. ఇక విక్రమ్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో మలయాళ విలక్షణ నటుడు సిద్ధికీతో పాటు ఎస్.జె.సూర్య, దుశరా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com